# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com E-mail : netinijam93@gmail.com

హైదరాబాద్ శుక్రవారం 5-5-2023 RNI No.52865/93·Postal No.HQ/SD/258/2021-2023 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 సంపుటి :29 సంచిక: 205 పేజీలు:6 వెల: రూ.1/-


## కుప్పకూలిన ఆర్మీ హెలికాప్టర్.. పైలట్లకు గాయాలైనట్లు



జమ్మూకశ్మీర్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);జమ్మూకశ్మీర్ లోని కిశ్త్వాఢ్ సమీపంలో ఓ ఆర్మీ హెలికాప్టర్ గురువారం కుప్పకూలింది. ప్రమాద సమయంలో హెలికాప్టర్‌లో ముగ్గురు అధికారులు ఉన్నట్లు సమాచారం. మార్వా ప్రాంతంలోని నదిలో హెలికాప్టర్ శకలాలు గుర్తించారు. ఈ ప్రమాదంలో పైలట్లకు గాయాలైనట్లు అధికారులు వెల్లడించారు. 'ఆర్మీ ఏఎల్‌హెచ్ ధ్రువ్ హెలికాప్టర్ జమ్మూకశ్మీర్‌లోని కిశ్త్వాఢ్ సమీపంలో కుప్పకూలింది. ప్రమాద సమయంలో చాపర్‌లో ముగ్గురు ఉన్నారు. వారు గాయాలతో సురక్షితంగా బయటపడ్డారు' అని ఆర్మీ అధికారులు వెల్లడించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉన్నాయి.

## మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర తేదీలు ఖరారు

**-2024 ఫిబ్రవరి 14 న మండమెలిగెతో మహాజాతరకు అంకురార్పణ**

**-21న సాయంత్రం 6 గంటలకు గద్దెల మీదకు సారలమ్మ, గోవింద రాజులు, పగిడిద్ద రాజులు 22న గద్దె మీదకు రానున్న సమ్మక్క**

మేడారం మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమ్మక్క-సారలమ్మ మహాజాతర తేదీలు ఖరారయ్యాయి. వనదేవతల సన్నిధిలో పూజారులు ముహూర్తాన్ని ప్రకటించారు. 2024 ఫిబ్రవరి 14 (బుధవారం)న మండమెలిగెతో మహాజాతరకు అంకురార్పణ జరుగుతుందని పూజారుల సంఘం అధ్యక్షుడు సిద్దబోయిన జగ్గారావు తెలిపారు. 2024 ఫిబ్రవరి 21న సాయంత్రం 6 గంటలకు సారలమ్మ, గోవింద రాజులు, పగిడిద్ద రాజులు దేవుళ్లను గద్దెల మీదకు తీసుకొస్తారు. 22న సమ్మక్క దేవతను గద్దె మీదకు తీసుకొస్తారు. 23 న ఈ దేవుళ్ళకు భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు. అలాగే చివరి రోజు 24న దేవుళ్లు వనప్రవేశం చేస్తారు. మహాజాతర 2024 ఫిబ్రవరి 21 (బుధవారం)న మహాజాతర ప్రారంభమై ఫిబ్రవరి 24న ముగుస్తుందని పేర్కొన్నారు. ఫిబ్రవరి 28న తిరుగువారం కార్యక్రమం ఉంటుందని వివరించారు.

మేడారం జాతరను తెలంగాణ ప్రభుత్వం 2014లో రాష్ట్ర పండుగగా గుర్తించింది. ఈ జాతర భారతదేశంలోనే అతిపెద్ద గిరిజన జాతర. ఇది విగ్రహాలు లేని జాతర. సమ్మక-సారలమ్మ జాతర గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రతిబింబిస్తుంది. ప్రతీ రెండు సంవత్సరాలకు ఒకసారి జరిగే ఈ జాతర మాఘ శుద్ధ పౌర్ణమి రోజున మొదలై నాలుగు రోజుల పాటు జరుగుతుంది. కుంభమేళ తర్వాత భారీగా భక్తజనం పాల్గొంటారు. రాష్ట్రం నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్ర, ఒడిషా తదితర పొరుగు రాష్ట్రాల నుండి వచ్చే లక్షలాది మంది భక్తులతో మేడారం ప్రాంతం జనసంద్రాన్ని తలపిస్తుంది. భక్తి పారవశ్యంతో, పూనకాలతో ఊగిపోతూ లక్షలాది భక్తులు సమ్మక్క-సారలమ్మ మొక్కులు చెల్లించుకుంటారు. మేడారం జాతరకు కోటిన్నర మంది భక్తులు వస్తారని అంచనా వేస్తున్నారు.

### మహాజాతర ఇలా..

ఫిబ్రవరి 21న (మాఘశుద్ధ ద్వాదశి) సాయంత్రం 6 గంటలకు సారలమ్మ, గోవింద రాజులు, పగిడిద్దరాజులు గద్దెలకు చేరుకుంటారు.

ఫిబ్రవరి 22న (మాఘ శుద్ధ త్రయోదశి) ఉదయం 8 గంటలకు కంకవనాన్ని గద్దెల వద్దకు తీసుకొస్తారు. సాయంత్రం 6 గంటలకు సమ్మక్క దేవతను గద్దెకు చేర్చుతారు.

ఫిబ్రవరి 23న (మాఘశుద్ధ చతుర్దశి) భక్తులు మొక్కులు చెల్లించుకుంటారు.

ఫిబ్రవరి 24న (మాఘ శుద్ధ పౌర్ణమి) సమ్మక్క, సారలమ్మ, పగిడిద్దరాజు, గోవిందరాజులు వనప్రవేశం చేస్తారు.

## ఢిల్లీలో బీఆర్ఎస్ కార్యాలయం ప్రారంభం

**- మీడియాకు నో ఎంట్రీ.**




న్యూఢిల్లీ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయం ప్రారంభమైంది. అనుకున్న ముహూర్తానికే అంటే సరిగ్గా మధ్యాహ్నం 1:05 గంటలకు బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు, తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.

ఈరోజు ఉదయం నుంచి పార్టీ కార్యాలయంలో పూజలు కొనసాగాయి. అనంతరం మూహూర్త సమయానికి సీఎం కేసీఆర్ పార్టీ కార్యాలయాన్ని ప్రారం భించారు. కార్యాలయం ప్రారం భోత్సవం అనంతరం మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎంపీలతో కేసీఆర్ తొలి సమావేశం నిర్వహించనున్నారు. 11 వేల చదరపు అడుగుల స్థలంలో బీఆర్ఎస్ పార్టీ కార్యాలయాన్ని నిర్మించారు. జీ ప్లస్ త్రీ విధానంలో భవన నిర్మాణం జరిగింది. లోయర్ గ్రౌండ్, గ్రౌండ్, మొదటి, రెండు, మూడు అంతస్తులతో కలిపి మొత్తం 5 అంతస్తులతో భవనాన్ని నిర్మించారు. మొదటి అంతస్తులో పార్టీ అధ్యక్షుడి చాంబర్, పేషీ, కాన్ఫరెన్స్ హాల్‌ను ఏర్పాటు చేశారు. గ్రౌండ్ ఫ్లోర్లో పార్టీ ప్రధాన కార్యదర్శుల కోసం నాలుగు గదులు, కార్యాలయ రిసెప్షన్, క్యాంటీన్‌ను నిర్మించారు. 2, 3 అంతస్తుల్లో ఢిల్లీలో పార్టీకి సంబ ంధించిన కార్యక్రమాలకు వచ్చే కార్య కర్తలు, నాయకులు బస చేసేందుకు 18 గదులతో పాటు రెండు ప్రత్యేక సూట్ రూమ్‌లు నిర్మించారు. సూట్ రూమ్‌లో పార్టీ అధ్యక్షుడు, పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు బస చేసేందుకు ఏర్పాట్లు జరిగాయి.

### మీడియాకు నో ఎంట్రీ...

కాగా.. ఈ కార్యక్రమాన్ని కవరేజ్ చేయడానికి వచ్చిన మీడియాకు బీఆర్ఎస్ కార్యాలయంలోకి అనుమతి లభించలేదు. అధికారుల ఆదేశాల మేరకు మీడియాను బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ ముందు నుంచి పోలీసులు బయటకు పంపించివేశారు. పార్టీ ఆఫీస్ ప్రాంగణంలో కూడా మీడియా వాళ్ళు ఎవరు ఉండవద్దంటూ హుకుం జారీ చేశారు. పైనుంచి ఆదేశాలు వచ్చాయని... అందుకోసమే మీడియాకు నో ఎంట్రీ అని ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది చెబుతోంది. ఈ ఆంక్షలపై మీడియా ప్రతినిధులు మండిపడుతున్నారు.

## మణిపూర్‌లో భారీ హింస.. రంగంలోకి దిగిన ఆర్మీ

**- 8 జిల్లాల్లో కర్ఫ్యూ విధింపు**

ఇంపాల్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: మణిపూర్‌లో గిరిజన గ్రూపులు చేస్తున్న ఆందోళన వల్ల 8 జిల్లాలో భయానక పరిస్థితులు



నెలకొన్నాయి. ఎస్టీ హోదా గురించి ఇటీవల కోర్టు తీర్పు ఇవ్వడాన్ని నిరసిస్తూ గిరిజనలు నిరసనలు చేపట్టారు. నిన్న రాత్రి ఇంపాల్, చురాచంద్‌పూర్, కంగ్‌పోక్పి ప్రాంతాల్లో హింసచెలరేగింది. దీంతో మొత్తం 8 జిల్లాల్లో కర్ఫ్యూ విధించారు. రాష్ట్రంలో 5 రోజుల పాటు మొబైల్ ఇంటర్నెట్ సేవల్ని ప్రభుత్వం నిలిపివేసింది.పరిస్థితుల్ని అదుపులోకి తెచ్చేందుకు ఆర్మీనిక రంగంలోకి దింపారు. ఆర్మీతో పాటు అస్సాం రైఫిల్స్ దళాలు హింసాత్మక ప్రాంతాల్లో పహారా కాస్తున్నాయి. ఆర్మీ క్యాంపుల్లో దాదాపు 7500 మందికి ఆశ్రయం కల్పించారు. మైటిస్ వర్గానికి గిరిజన హోదా ఇవ్వడాన్ని వ్యతిరేకిస్తూ మణిపూర్‌లో ఆందోళనలు నిర్వహిస్తున్నారు. మణిపూర్ కాలిపోతోందని, దయ చేసి ఆదుకోండి అని బాక్సర్ మేరీ కోమ్ తన ట్వీట్‌లో కోరారు. గత రాత్రి నుంచి మణిపూర్‌లో పరిస్థితి అత్యంత దయనీయంగా మారినట్లు ఆమె చెప్పారు. హింసలో కొందరు తమ కుటుంబసభ్యుల్ని కోల్పోవడం దురదృష్టకరమన్నారు.ఏటీఎస్‌యూఎం ఆధ్వర్యంలో గిరిజన సంఘీభావ ర్యాలీ నిర్వహించారు. మైటిస్ వర్గానికి ఎస్టీ హోదా ఇవ్వడాన్ని ఆ సంఘం వ్యతిరేకిస్తోంది. తమను ఎస్టీ జాబితాలో చేర్చాలని మైటిస్ వర్గం ఇటీవల ప్రభుత్వాన్ని పలుమార్లు డిమాండ్ చేసింది. ఆ ఉద్యమం ఊపందుకోవడంతో.. గిరిజన సంఘాలు ఆందోళన చేపట్టాయి. మణిపూర్ సీఎం బీరెన్ సింగ్‌తో అక్కడ పరిస్థితి గురించి కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా చర్చించారు.

## హైదరాబాద్‌లోని హైకోర్టు సమీపంలో దారుణ హత్య

హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: హైదరాబాద్‌లోని హైకోర్టు సమీపంలో దారుణ హత్య జరిగింది. హైకోర్టు గేటు నంబర్ 6 వద్ద ఓ వ్యక్తిని దుండగుడు కత్తితో పొడిచి చంపాడు. నడిరోడ్డుపై అంతా చూస్తుండగానే హత్యచేసి అక్కడి నుంచి పారిపోయాడు. రూ.10 వేల విషయంలో ఇద్దరి మధ్య గొడవ జరిగినట్లు తెలుస్తున్నది. స్థానికుల సమాచారంతో పోలీసులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం గాంధీ దవాఖానకు తరలించారు. మృతుడిని హైకోర్టు సమీపంలో ఉన్న సులభ్ కాంప్లెక్స్‌లో పనిచేస్తున్న మిథున్‌గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నారు.

## ఏపీ వైపు దూసుకు వస్తున్న 'మోచా' తుఫాను

అమరావతి, మే4:రానున్న 48 గంటల్లో బంగాళాఖాతం ఆగ్నేయ ప్రాంతంలో ఉపరితల ఆవర్తనం ఏర్పడుతుందని ఐఎండీ తెలిపింది. 6వ తేదీన తుఫానుగా మారుతుందని.. దీని ప్రభావం ఒడిశా, ఏపీ రాష్ట్రాలపై తీవ్రంగా ఉంటుందని వాతావరణ శాఖ అంచనా వేసింది. ఈ రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తాయని వెల్లడించింది. తుఫాను వస్తే దానికి మోచా అనే పేరు పెట్టనున్నారు. గత ఏడాది ఇదే నెలలో మే 22న అసని తుఫాను బీభత్సం సృష్టించింది. ఇప్పుడు మళ్ళీ అలాంటి ప్రతికూల పరిస్థితులు కనిపించేలా ఉన్నాయని చెబుతున్నారు. ఏపీ వాతావరణంలో రానున్న 48 గంటల్లో భారీ మార్పులు చోటు చేసుకుంటాయని ఐఎండీ తెలిపింది. రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించింది.

ఢిల్లీలో జరిగిన మీడియా సమావేశంలో భారత వాతావరణ శాఖ డైరెక్టర్ జనరల్ మృత్యుంజయ్ మహాపాత్ర ఈ వివరాలను వెల్లడించారు. "మే 6 నాటికి ఆగ్నేయ బంగాళాఖాతంలో వాయుగుండం ఏర్పడే అవకాశముంది. ఆ మరుసటి రోజు అదే ప్రాంతంలో అల్పపీడనం ఏర్పడనుంది. ఆ తర్వాత ఇది తీవ్ర అల్పపీడనంగా కేంద్రీకృతమై మే 9వ తేదీ నాటికి తుపానుగా బలపడే అవకాశముంది. ఈ తుపాను ఉత్తర దిశగా కదులుతూ మరింత తీవ్రమయ్యే అవకాశముందని వాతావరణ శాఖ అంచనా వేసింది'' అని ఆయన తెలిపారు..ఈ తుపాను ఏర్పడితే దానికి 'మోచా అని పేరు పెట్టనున్నట్లు ఐఎండీ తెలిపింది. యెమెన్ దేశంలోని పోర్టు నగరం మోచా పేరుమీదుగా పేరు పెట్టినట్టు పేర్కొంది. అల్పపీడనం ఏర్పడిన తర్వాత తుపాను దిశ గురించి మరింత కచ్చితమైన సమాచారం తెలుస్తుందని ఐఎండీ వెల్లడించింది. వచ్చేవారంలో ఆగ్నేయ బంగాళాఖాతంలో గంటకు 40-50 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచే అవకాశముందని పేర్కొంది. మత్స్యకారులు సముద్రంలోకి వెళ్లొద్దని హెచ్చరించింది.

## 6న, ఆర్ట్స్ కళాశాల విజ్ఞానోత్సవ-2023 కార్యక్రమం

హన్మకొండ ,నేటినిజం :చారిత్రాత్మకమైన 96, సంవత్సరాల సుదీర్ఘ చరిత్ర కలిగిన హనుమకొండ సుబేదారిలోని కాకతీయ విశ్వవిద్యాలయం ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల లో 6 ఆరవ తేదీ( శనివారం )నాడు కళాశాల విజ్ఞానోత్సవ-2023 కార్యక్రమం నిర్వహించబడుతుందని ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య బన్న ఐలయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో కాకతీయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య తాటికొండ రమేష్ ముఖ్యఅతిథిగా పాల్గొంటారని, అదేవిధంగా శాసన మండలి సభ్యుడు దేశపతి శ్రీనివాస్, హనుమకొండ, వరంగల్ జిల్లా కలెక్టర్లు సిక్తా పట్నాయక్, పి ప్రావీణ్య, కేయూ రిజిస్టర్ ఆచార్య టి శ్రీనివాసరావు, ద్రోణాచార్య అవార్డు గ్రహీత నాగపురి రమేష్, గాయకుడు డాక్టర్. జయరాజ్, బలగం సినిమా నటుడు, అరసం మధుసూదన్, పాల్గొననున్నారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య బన్న ఐలయ్య అధ్యక్షత వహిస్తారు, కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ హనుమంతు , అధ్యాపకులు విద్యార్థులు పాల్గొంటారు అని ప్రిన్సిపల్ పేర్కొన్నారు.

## ఛత్తీస్‌గఢ్‌లో ఘోర రోడ్డు ప్రమాదం...10మంది మృతి



ఛత్తీస్‌గఢ్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఛత్తీస్‌గఢ్ లో బుధవారం రాత్రి జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో 10 మంది మరణించారు. జాతీయ రహదారిపై ఎస్‌యూవీ, ట్రక్కు ఢీకొన్న ఘటనలో 10 మంది మృతి చెందగా, పలువురు గాయపడ్డారు. మరణించిన వారంతా ఒకే కుటుంబానికి చెందిన వారు. రోడ్డు ప్రమాదంలో చిన్నారి సహా పలువురు గాయపడగా, వారిని ఆస్పత్రికి తరలించారు.ఛత్తీస్‌గఢ్‌లోని ధామ్‌తరి జిల్లాలో బుధవారం అర్ధరాత్రి బొలెరో ట్రక్కును ఢీకొన్న ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన 10 మంది వ్యక్తులు అక్కడికక్కడే మృతి చెందారు. రోడ్డు ప్రమాదంలో చిన్నారి సహా పలువురు గాయపడగా, వారిని ఆసుపత్రికి తరలించారు.

జగత్రా సమీపంలోని కంకేర్ జాతీయ రహదారిపై ఈ ప్రమాదం జరిగింది.కుటుంబం సొరం నుంచి మర్కటోలాకు వెళుతుండగా ఈ ఘోర ప్రమాదం సంభవించింది. క్షతగాత్రులను మెరుగైన చికిత్స కోసం రాయ్‌పూర్‌కు తరలించినట్లు ఎస్పీ జితేంద్ర కుమార్ యాదవ్ చెప్పారు. ఛత్తీస్‌గఢ్ ముఖ్యమంత్రి భూపేష్ బాఘెల్ మృతుల కుటుంబాలకు సంతాపం తెలిపారు. ఈ ప్రమాదంలో గాయపడిన బాలిక,పిల్లలు త్వరగా కోలుకోవాలని సీఎం ఆకాంక్షించారు.ప్రమాదం జరిగిన కొద్దిసేపటికే పురూర్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.పోలీసులు కేసు నమోదు చేశారు.

## వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ పనులను వేగవంతం

**- ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించిన మంత్రి హరీశ్ రావు**



హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆలోచనతో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆస్పత్రుల నిర్మాణ పనులను వేగంగా పూర్తి చేయాలని రాష్ట్ర వైద్యారోగ్య శాఖ మంత్రి హరీశ్ రావు ఆర్ అండ్ బీ అధికారులను ఆదేశించారు. వరంగల్ హెల్త్ సిటీ పనులు దసరా నాటికి పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని, ప్రారంభించేందుకు సిద్ధం చేయాలని చెప్పారు. గ్రేటర్ పరిధితో పాటు, నగర శివారు ప్రాంత ప్రజలకు సూపర్ స్పెషాలిటీ సేవలు మరింత చేరువ చేసే లక్ష్యంతో ఏర్పాటు చేస్తున్న సనత్ నగర్, ఎల్‌బీ నగర్, అల్వాల్ టిమ్స్ ఆసుపత్రుల నిర్మాణాలు వేగవంతం చేయాలని ఆదేశించారు. నిమ్స్ విస్తరణ పనుల్లో భాగంగా నిర్మించే 2000 పడకల బిల్డింగ్‌కు పది రోజుల్లో టెండర్ల ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. ఇక నుండి నెలవారీగా వీటి పురోగతిపై సమీక్ష చేస్తానని, అధికారులు పురోగతి నివేదికలతో సిద్ధంగా ఉండాలని హరీశ్‌రావు ఆదేశించారు.వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ ఆస్పత్రులు, నిమ్స్ కొత్త బిల్డింగ్, డయాలిసిస్ సేవలు, బస్తీ దవాఖానలు, పల్లె దవాఖానలు, కంటి వెలుగు తదితర అంశాలపై మంత్రి హరీశ్ రావు సంబంధిత అధికారులతో సచివాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజలకు నాణ్యమైన వైద్యం అందించే దిశగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ విప్లవాత్మమైన చర్యలు తీసుకుంటున్నారని చెప్పారు. ఇందులో భాగంగా ఒక వైపు వైద్యం, మరోవైపు వైద్య విద్యను విస్తృతం చేస్తున్నట్లు చెప్పారు. కొత్తగా ఏర్పాటు చేస్తున్న వరంగల్ మల్టీ స్పెషాలిటీ ఆస్పత్రి పూర్తయితే మెడికల్ హబ్‌గా మారుతుందన్నారు. ఢిల్లీలోని ఎయిమ్స్ తరహాలో టిమ్స్ సేవలు ఉండాలన్నది ముఖ్యమంత్రి కేసీఆర్ సంకల్పం అని మంత్రి అన్నారు. ఒక్కొక్కటి 1000 పడకలతో ఉన్న ఈ ఆస్పత్రులను త్వరగా పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి వచ్చేలా కృషి చేయాలన్నారు. వరంగల్ హెల్త్ సిటీ, టిమ్స్ నిర్మాణాలకు సంబంధించి వైద్యారోగ్య శాఖ తరుపున అవసరమైన అన్ని చర్యలు పూర్తి చేసినట్లు తెలిపా రు. కాబట్టి ఆర్ అండ్ బీ అధికారులు పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా విస్తరించుకునే విధంగా నిర్మాణాలు ఉండాలని సూచించారు.

### డయాలసిస్ సెంటర్లు ప్రారంభించాలి

తెలంగాణ ఏర్పాటుకు ముందు రాష్ట్రంలో 3 డయాలిసిస్ కేంద్రాలు మాత్రమే ఉంటే, కిడ్నీ బాధితులకు ఇబ్బంది కలగకుండా ఉండేందుకు సీఎం కేసీఆర్ ఆదేశాల మేరకు 102 కు పెంచుకున్నట్లు చెప్పారు. ప్రారంభానికి సిద్ధంగా ఉన్న డయాలిసిస్ కేంద్రాలు స్థానిక ఎమ్మెల్యేలతో ప్రారంభించి ప్రజలకు త్వరగా అందుబాటులోకి తేవాలన్నారు. మూడు క్లస్టర్స్ గా విభజించి గాంధీ, ఉస్మానియా, నిమ్స్ ఆసుపత్రులకు పరిశీలన బాధ్యతలు అప్పగించినట్లు చెప్పారు. బాధితులకు నిరంతర సేవలు అందేలా కృషి చేయాలని ఆదేశించారు.

## చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం సహాయ సహకారాలు : మంత్రి తలసాని

హైదరాబాద్, మే4:రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి ప్రభుత్వం అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తుందని రాష్ట్ర సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ప్రముఖ దర్శకుడు,నిర్మాత, నటుడు దాసరి నారాయణరావు 76 వ జయంతి సందర్భంగా చిత్రపురి కాలనీలో నూతనంగా ఏర్పాటు చేసిన ఆయన విగ్రహాన్ని మంత్రి ఆవిష్కరించి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో మంత్రి మాట్లాడారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత సీఎం కేసీఆర్ రాష్ట్రంలో చిత్ర పరిశ్రమ అభివృద్ధికి సహకారాలు అందిస్తున్నారని పేర్కొన్నారు. సినీ పరిశ్రమలోని 24 విభాగాలకు చెందిన కార్మికులకు ఏ సమస్య వచ్చినా నేను ఉన్నానంటూ దాసరి నారాయణరావు ఒక ధైర్యాన్ని కల్పించారని తెలిపారు. 150 చిత్రాలకు దర్శకత్వం వహించి గిన్నీస్ బుక్‌లో చోటు దక్కించుకున్నారని గుర్తు చేశారు. బంగారు నంది, నంది, ఉత్తమ నటుడు, ఉత్తమ దర్శకుడు అవార్డులను ఆయన అందుకున్నారని పేర్కొన్నారు.దాసరి నారాయణరావు మరణంతో సినీ పరిశ్రమ ఒక పెద్ద దిక్కును కోల్పోయిందని అన్నారు. నటుడు ప్రభాకర్ రెడ్డి తో కలిసి దాసరి నారాయణరావు నాటి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకొచ్చిన ఫలితంగానే చిత్రపురి కాలనీ(ఇఃప్రతిబితీజీజూబీతీతి ఇఃనీశ్రీనినిఎ)లో వేలాదిమంది కార్మికులకు ఇండ్లు కేటాయించారని వెల్లడించారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను పరిశ్రమలోని అర్హులైన వారందరికీ అందిస్తామని ప్రకటించారు. ఈ కార్యక్రమంలో నిర్మాత సీ కళ్యాణ్, డైరెక్టర్ నిమ్మల శంకర్, దాసరి అరుణ్ కుమార్, చిత్రపురి కాలనీ అధ్యక్షుడు అనిల్, దొరై రాజు తదితరులు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ జాతీయ ప్రస్థానం.. నేడు ఒక చారిత్రక అవసరం : మంత్రి కేటీఆర్



హైదరాబాద్, మే4:ఢిల్లీలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పార్టీ శ్రేణులకు కేటీఆర్ శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా కేటీఆర్ ఓ సందేశం ఇచ్చారు. నాడు జలదృశ్యం.. నేడు ఢిల్లీలో అద్వితీయ దృశ్యం ఆవిష్కృతమైంది. ఢిల్లీలో పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం కేవలం బీఆర్ఎస్ పార్టీ శ్రేణులకే కాదు.. తెలంగాణ ప్రజలకు సైతం గర్వకారణం. ఉద్యమ నాయకుడే.. ఉత్తమ పాలకుడని యావత్ దేశం కొనియాడుతోంది. బీఆర్ఎస్ పార్టీ జాతీయ ప్రస్థానం.. నేడు ఒక చారిత్రక అవసరం అని కేటీఆర్ పేర్కొన్నారు. అబ్ కీ బార్ కిసాన్ సర్కార్ అనే నినాదాన్ని నిజం చేసే వరకు విశ్రమించకుండా పని చేద్దామని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు.

### దేశ ప్రజలను గెలిపించడానికే హస్తినలో అడుగుపెట్టాం..

నాడు ఉద్యమ పార్టీగా పురుడు పోసుకుని, ప్రత్యేక రాష్ట్ర ఆకాంక్షను నెరవేర్చిన గులాబీ జెండా.. ఇప్పుడు దశాబ్దాలుగా దగాపడ్డ దేశ ప్రజలను గెలిపించడానికే హస్తినలో అడుగుపెట్టింది అని కేటీఆర్ తెలిపారు. ఉద్యమ పాఠాల నుంచి మొదలుకుని, యావత్ దేశానికి ఉజ్వలమైన పరిపాలనా పాఠాలు నేర్పిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కింది. ఈ మహా ప్రస్థానంలో బీఆర్ఎస్ వేసిన ప్రతి అడుగు సంచలనమే. అధికార పార్టీగా తీసుకున్న ప్రతి నిర్ణయం ఓ సువర్ణ అధ్యాయం అని కేటీఆర్ పేర్కొన్నారు.

### గోల్డెన్ తెలంగాణ మోడల్‌పైనే దేశ వ్యాప్తంగా చర్చ..

గోల్‌మాల్ గుజరాత్ మోడల్ పనికిరాదని దేశ ప్రజలు గ్రహించారు. గోల్డెన్ తెలంగాణ మోడల్ పైనే ప్రస్తుతం చర్చ జరుగుతోంది అని కేటీఆర్ తెలిపారు. జాతీయ రాజకీయ యవనికపై బీఆర్ఎస్ బలమైన ముద్ర వేయడం ఖాయం. బీఆర్ఎస్‌ను అజేయశక్తిగా తీర్చిదిద్దడమే ఏకైక లక్ష్యంగా పని చేస్తున్న ప్రతి ఒక్క గులాబీ సైనికుడి బాధ్యత ఇప్పుడు మరింత పెరిగింది. రానున్న రోజుల్లో మరింత సమరోత్సాహంతో కదం తొక్కాలని పార్టీ శ్రేణులకు కేటీఆర్ పిలుపునిచ్చారు. నాడు తెలంగాణ సాధన కోసం ఏ సంకల్పంతో బయల్దేరామో అదే స్ఫూర్తితో దేశం కోసం కదం తొక్కాలి అని కేటీఆర్ పిలుపునిచ్చారు.

### నేటి కందం- నేటికి అందం

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

కం॥ కొందరిదగు పెద్దరికము
నందరి దగుపెదరికము నంతము జేయున
అందరికి సమానత్వము
నందించిన "మార్క్స్" వరున నర్చింతు ధీశాలిన్



(మే 5 కారల్ మార్క్స్ జననం..)

-రాధశ్రీ

సెల్:9494481210

నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

# మాతాశిశు సంక్షేమమే మంత్రసానుల ఏకైక లక్ష్యం?!

## (05 మే 'అంతర్జాత మంత్రసానుల దినం' సందర్భంగా)

ప్రతి ఏటా 05 మే రోజున 'ఇంటర్నేషనల్ కన్ఫెడరేషన్ ఆఫ్ మిడ్‌వైఫ్స్' నేతృత్వంలో 'అంతర్జాతీయ మంత్రసానుల దినం (ఇంటర్నేషనల్ మిడ్‌వైఫ్స్ డే)' ఘనంగా, గర్వంగా నిర్వహించుట ఆనవాయితీగా వస్తున్నది. ఇంటర్నేషనల్ మిడ్‌వైఫ్స్ డే–2023 నినాదంగా 'ఐక్యతతో మరోసారి – సాక్ష్యం నుంచి వాస్తవం వైపు' అనే అంశాన్ని తీసుకొని పలు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ప్రసవ సేవలు, పురుటి నొప్పులు, గర్భిణి సేవలు, సంతానోత్పత్తి, లైంగిక సమస్యలు, మాతృత్వ విధులు, నవజాత శిశు లాలన, ప్రసవానంతర సూచనలు, పిల్లలు, కౌమారదశ యువత ఆరోగ్య సమస్యలు లాంటి బహువిధ సేవలను నిస్వార్థంగా అందించే పవిత్ర మంత్రసాని వృత్తిని గౌరవించడం, వారికి కృతజ్ఞతలు తెలియచేయటం మన కనీస బాధ్యతగా గుర్తించాలి. ప్రపంచవ్యాప్తంగా మంత్రసానులు ఏకమై ఈ దినోత్సవాన్ని ఘనంగా జరుపుకోవడం పరిపాటి అయ్యింది. శిశు జననం, నవజాత శిశువు ఆరోగ్యం మంత్రసానుల విధి నిర్వహణపై మాత్రమే ఆధారపడి ఉంటుంది.

మాతాశిశు సంక్షేమానికి పునాదులు:

ప్రపంచ ఆరోగ్య సంస్థ నేతృత్వంలో విడుదల చేసిన 'ప్రపంచ మంత్రసాని వృత్తి నివేదిక ఆధారంగా మంత్రసాని వృత్తి పట్ల ప్రత్యేక శ్రద్ధ, ప్రసవ సమయ జాగ్రత్తలు/ నవజాత శిశువు రక్షణ లాంటి అంశాల్లో సరైన శాస్త్రసాంకేతిక శిక్షణ తప్పక అందించాలని ఐరాస సభ్యదేశాలకు సూచనలు చేసింది. ఐరాస నిర్ధేషించిన 'సుస్థిరాభివృద్ధి లక్ష్యాలు–3.1' ప్రకారం 2030 నాటికి ప్రతి లక్ష ప్రసవాలలో శిశు మరణాలు 70 కన్న తక్కువ ఉండేలా పటిష్ట చర్యలు తీసుకోవాలని నిర్ణయించి, కార్యాచరణ రూపొందించారు. 1991లో ప్రారంభమైన వరల్డ్ మిడ్‌వైఫరీ డే సందర్భంగా ర్యాలీలు, పోటీలు, మంత్రసానులకు పుష్పగుచ్ఛాలు అందించడం, పలు కార్యశాలలు నిర్వహించడం జరుగుతోంది. మాతాశిశు సంక్షేమానికి పుణాది వేసిన వారిలో మంత్రసానుల పాత్ర అద్వితీయం, అనితర సాధ్యం.

తల్లీ బిడ్డలకు మంత్రసానుల అమృత స్పర్శే రక్షణ గొడుగు:

ప్రపంచవ్యాప్తంగా రోజుకు 850 గర్భిణి మహిళలు ప్రసవ సమయంలో మరణించడం జరుగుతుంది. ఏడాదికి 2 మిలియన్ల నవజాత శిశువులు, 2.6 మిలియన్ల గర్భంలోని శిశువులు మరణించడం జరుగుతోందని వివరాలు తెలుపుతున్నాయి. శిశువుకు అమ్మగా, ప్రసవ వేదన పడుతున్న మహిళకు తల్లిగా, గర్భిణి కుటుంబ సభ్యురాలిగా, గర్భిణి స్త్రీకి సోదరిగా అనేక పాత్రలు పోషించే మంత్రసానులకు తగిన గౌరవం సమాజంలో దక్కడం లేదు. మంత్రసానులు లేకుండా జరిగే కాన్పులలో తల్లికి, శిశువుకు ప్రమాదకరంగా మారుతుందని మనకు తెలుసు. మంత్రసాని చేతిలో అమృత స్పర్శ ఉంది. తమ వ్యక్తిగత సమస్యలను పక్కన పెట్టి నవజాత శిశువును మృదువుగా, ప్రసవ వేదనలో ఓపికకు రూపంగా, మాతాశిశ రక్షణలో వైద్యురాలిగా తన విధులను సర్వోన్నత నిష్టతో నిర్వహించే మంత్రసానికి మాతా శిశువులు సదా కృతజ్ఞతలు తెలియజేయాల్సిందే. మంత్రసానులకు మనస్ఫూర్తిగా కృతజ్ఞతలు వ్యక్తం చేయడానికి మగ మహారాజులు మరువకుండా మరింత చొరవ తీసుకోవాలి.



– డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

# విద్యార్థులకు ఉచితంగా వర్క్ బుక్స్, నోట్ బుక్స్: మంత్రి సబితా

హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ న్);: రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు ఉచితంగా వర్క్ బుక్స్, నోట్ బుక్స్ అందజేయనున్నట్లు రాష్ట్ర విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి వెల్లడించారు. ప్రాథమిక పాఠశాలల్లో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులకు వర్క్ బుక్స్ ను, ఉన్నత పాఠశాలల్లోని విద్యార్థులకు నోటు పుస్తకాలను ఉచితంగా అందజేయాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు ఆమె తెలిపారు. రాష్ట్రంలో విద్యారంగం అభివృద్ధికి సీఎం కే చంద్రశేఖర్ రావు తీసుకున్న గొప్ప నిర్ణయం ఇదని మంత్రి పేర్కొన్నారు. ఇవాళ సచివాలయంలోని తన కార్యాలయంలో విద్యాశాఖ పనితీరుపై మంత్రి సబితా ఇంద్రారెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రభుత్వం తీసుకున్న ఉచిత పుస్తకాల నిర్ణయంతో రాష్ట్రంలోని 24 లక్షల మంది విద్యార్థులకు ప్రయోజనం కలుగుతుందన్నారు. వర్క్ బుక్స్‌ను, నోట్ బుక్స్‌ను పాఠశాల ప్రారంభమయ్యే నాటికి అందజేసేలా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. అదేవిధంగా రాష్ట్రంలోని విద్యార్థులందరికీ బైలింగ్వల్ పాఠ్యపుస్తకాలను పాఠశాల పునః ప్రారంభమయ్యే నాటికి అందజేయాలని ఆదేశించారు. గత సంవత్సరం పాఠ్య పుస్తకాల పంపిణీ కోసం రూ.132 కోట్లు ఖర్చు చేయగా, రానున్న విద్యా సంవత్సరానికిగాను రూ.200 కోట్లు వెచ్చించి పాఠ్య పుస్తకాలను విద్యార్థులకు ఉచితంగా అందిస్తున్నామని మంత్రి తెలిపారు. దాదాపు రూ.150 కోట్లతో ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులందరికీ ఒక్కొక్కరికి రెండు జతల యూనిఫామ్ ను పాఠశాల పునః ప్రారంభం నాటికి అందేజేసే విధంగా చర్యలు చేపట్టాలని మంత్రి ఆదేశించారు. జూన్ 12 నుంచి పాఠశాల పునః ప్రారంభమవుతున్నందున బడిబాట కార్యక్రమం ఏర్పాటు చేసి అందులో స్థానిక శాసనసభ్యులను, ప్రజాప్రతినిధులను భాగ్యస్వామ్యం చేయాలని మంత్రి సూచించారు. స్థానిక శాసన సభ్యులు, ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో నోటు పుస్తకాల పంపిణీ, పాఠ్య పుస్తకాల పంపిణీ, యూనిఫామ్‌ల పంపిణీ చేపట్టాలని అధికారులకు మంత్రి సూచించారు. శాసనసభ్యులు, స్థానిక ప్రజాప్రతినిధులు పాఠశాలలకు హాజరయ్యే సమయంలో విద్యార్థుల తల్లిదండ్రులను కూడా ఆహ్వానించాలన్నారు. పాఠశాల పునః ప్రారంభం రోజున పాఠశాలల్లో పండగ వాతావరణం కల్పించాలని మంత్రి ఆదేశించారు. మన ఊరు–మనబడి కార్యక్రమంలో చేపట్టిన పనులను జూన్ మొదటి వారంలోగా పూర్తి చేయాలని సూచించారు. సమావేశంలో విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ పాఠశాల విద్య సంచాలకులు, శ్రీ దేవసేన తదితరులు పాల్గొన్నారు.

# చిత్తూరువద్ద 16 మంది అంతర్రాష్ట్ర ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్టు

చిత్తూరు మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: ఏపీలోని చిత్తూరువద్ద 16 మంది అంతర్రాష్ట్ర స్మగ్లర్లను పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి రూ.40 లక్షల విలువైన 160 కిలోల ఎర్రచందనాన్నిబుధవారం స్వాధీనం చేసుకున్నారు. పక్కా సమాచారం అందుకున్న చిత్తూరు పోలీసులు చెన్నై–బెంగళూరు రోడ్డులోని యర్రావారిపాలెంవద్ద వేర్వేరుగా జరిపిన దాడుల్లో ట్రక్కు, కారు, ద్విచక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. చిత్తూరు నుంచి చెన్నై వైపు వేగంగా వెళ్తున్న ఎస్‌యూవీ కారును ఆపి తనిఖీ చేయగా అందులో 5 ఎర్రచందనం బయటపడ్డాయి. ఈ కారును అనుసరిస్తున్న మరో వాహనంలో 7 ఎర్రచందనం దుంగలు గుర్తించినట్లు పోలీసులు తెలిపారు. నిందితులు ఆంధ్రప్రదేశ్ నుంచి తమిళనాడుకు అక్రమంగా ఎర్రచందనం దుంగలను తరలిస్తున్నట్లు పోలీసులు తెలిపారు. కాగా 2022 డిసెంబర్లలో ఎర్రచందనం అక్రమంగా తరలిస్తున్న ఏడుగురు వ్యక్తులను అరెస్ట్ చేశారు. వారి నుంచి రూ.46 లక్షల విలువైన 30 ఎర్రచందనం దుంగలను స్వాధీనం చేసుకున్నారు. కాగా తిరుపతిలో పోలీసులు నిర్వహించిన దాడుల్లో ఏడుగురు నిందితులు పలుమార్లు పట్టబడ్డారు.

# జగన్ అసమర్థతతో అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయి

## – రెడ్డిపై టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు

మంగళగిరి మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ న్):: ఏపీ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై టీడీపీ అధినేత నారా చంద్రబాబునాయుడు ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ అసమర్థతతో అన్ని వ్యవస్థలు నాశనం అయ్యాయని, గతంలో తాము సన్ రైజ్ ఆంధ్రప్రదేశ్ అని పేరు పెట్టుకున్నామని చంద్రబాబు గుర్తు చేశారు. ఏపీలో ఉండే వనరులు ఉపయోగించుకుని ముందుకు వెళ్లామని, ఏపీకి వెయ్యి కిలోమీటర్ల తీర ప్రాంతం ఉందని, సముద్రాన్ని వినియోగించు అనేక దేశాలతో వ్యాపారం చేయచ్చని చంద్రబాబు తెలిపారు. ఏపీని 2021లోగా నెంబర్ వన్ చేయాలని ప్రణాళిక వేసుకున్నామని, 2016కే ఎఫ్?డీఐలను ఆకర్షించే టాప్–3 రాష్ట్రాల్లో ఏపీ ఉందని, టీడీపీ హయాంలో సన్ రైజ్ ఏపీ పేరుతో ముందుకు వెళ్లామని చంద్రబాబు చెప్పారు. కృష్ణపట్నం నుంచి భావనపాడు వరకు పోర్టుల అభివృద్ధి చేపట్టామని, తమ హయాంలో రూ.16 లక్షల కోట్ల పెట్టుబడులు తెచ్చామని, విశాఖలో మూడు సార్లు సీఐఐ సదస్సులు పెట్టామని చంద్రబాబు వెల్లడించారు. ఏపీలో రివర్స్ పాలన జరుగుతోందని, రివర్స్ పాలనలో జగన్ గేర్లు మారుస్తూ చాలా స్పీడుగా వెళ్తున్నారని, వ్యవస్థలన్నీ పతనావస్థకు చేరాయని చంద్రబాబు విమర్శించారు. యువత నిరాశకు లోనయ్యారని, పెట్టుబడులు రావడం లేదని మండిపడ్డారు. సన్ రైజ్ ఏపీ అనే పేరుతో ఏపీలో పెట్టుబడులని ఆకర్షించామని, గ్లోబల్ ఎడ్వాంటేజ్ తీసుకునే ప్రయత్నం చేశామన్నారు. పెట్టుబడుల కోసం శ్రమించామని, వివిధ రంగాల్లో ఏపీని నెంబర్–1గా నిలిపామన్నారు. పోర్టులను అనుసంధానం చేసుకుంటూ పోర్ట్ లెడ్ ఎకానమీకి శ్రీకారం చుట్టామని తెలిపారు. జగన్ కన్నార్పకుండా అబద్దాలు చెబుతారని, భావనపాడు పోర్ట్ అంటే టీడీపీ గుర్తొస్తుందని మూలపాడు పోర్టు అని పేరు మార్చారని మండిపడ్డారు. హైదరాబాద్ కోసం రూపొందించిన విజన్ 2020 గురించి ఇప్పుడెవరైనా మాట్లాడితే వైసీపీ నేతలు చిర్రుబుర్రులాడుతున్నారని చంద్రబాబు విమర్శించారు.

అకాల వర్షాలతో పంట నష్టపోయిన రైతులకు అండగా నిలవడంలో ఏపీ సీఎం జగన్ రెడ్డి విఫలమయ్యారని టీడీపీ అధినేత చంద్రబాబు పేర్కొ?న్నారు. కష్టాల్లో ఉన్న అన్నదాతలకు అండగా నిలవాలని శ్రేణులకు చంద్రబాబు పిలుపునిచ్చారు. 4, 5 తేదీలలో ముంపు ప్రాంతాల్లో చంద్రబాబు పర్యటించనున్నారు. వర్షాలపై ముందస్తు సమాచారం, ఏర్పాట్లు చేయకపోవడంతో ఎక్కువగా పంట నష్టం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి గాని, మంత్రులు గాని రైతులను కనీసం పరామర్శించడం లేదని చంద్రబాబు విమర్శించారు. ఐదేళ్ల కిందట ప్రారంభోత్సవం జరిగిన భోగాపురం ఎయిర్ పోర్ట్‌ను తన సొంత ప్రచారం కోసం తిరిగి ప్రారంభించారని పేర్కొన్నారు. ఫుల్ పేజీ యాడ్‌లకు ప్రభుత్వ ధనం భారీగా ఖర్చు చేస్తున్నారని విమర్శించారు. ఇవ్వాల్సిన అవసరం లేకున్నా కేవలం కమిషన్ల కోసం హిందూజాలకు, అమూల్‌కు వేలకోట్లు ప్రభుత్వ ధనం ధారాదత్తం చేశారని చంద్రబాబు ఆరోపించారు. "ఈ దుబారా చేయకుండా రైతులకు ఎందుకు ఇవ్వడం లేదు? నష్టపోయిన వరి, మొక్కజొన్న రైతుకు ఎకరాకు రూ.30 వేల పరిహారం ఇవ్వాలి. మిర్చి, అరటి, మామిడి రైతులకు ఎకరాకు రూ.50 వేల పరిహారం అందించాలి. పిడుగుపాటు గురై మరణించిన వ్యక్తి కుటుంబానికి 10 లక్షల పరిహారం అందించాలి. తడిచిన రంగుమారిన ధాన్యాన్ని మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. రైతులకు తగినన్ని నాణ్యమైన గోనె సంచులు సరఫరా చేయాలి. తరుగు పేరుతో రైతుల్ని దోచుకోవడం అరికట్టాలి. ఆత్మహత్య చేసుకున్న రైతులకు పరిహారం ఎందుకు ఇవ్వడం లేదు?" అని చంద్రబాబు ప్రశ్నించారు.

# నెక్లెస్ రోడ్డులో నీరా కేఫ్ ప్రారంభం



హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్ ): హైదరాబాద్ నెక్లెస్ రోడ్డులో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన నీరా కేఫ్‌ను రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్‌తో కలిసి రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి శ్రీనివాస్ గౌడ్ ప్రారంభించారు.

ప్రకృతి సిద్ధమైన, స్వచ్ఛమైన నీరాను రాష్ట్ర ప్రజలకు అందించనున్నారు. గీత వృత్తిదారులకు రైతు బీమా తరహాలో గీత కార్మికుల బీమానుఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. గీత వృత్తి ప్రోత్సాహానికి సీఎం కేసీఆర్ ఎంతో కృషి చేస్తున్నారన్నారు. రైతు బీమా మాదిరిగా గీత కార్మికుల కోసం రూ. 5 లక్షల బీమాను కల్పించినందుకు సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా 50 ఏండ్ల వయస్సు పైబడిన, అర్హులైన దాదాపు లక్ష మంది గీత కార్మికులకు ప్రతి నెల రూ. 2016 ల పెన్షన్లు అందిస్తున్నామన్నారు. మద్యం దుకాణం కేటాయింపుల్లో గౌడ సామాజిక వర్గానికి 15 శాతం, ఎస్సీ, ఎస్టీలకు 15 శాతం రిజర్వేషన్లు కల్పించడం సాహోసోపేతమైన నిర్ణయం అని శ్రీనివాస్ గౌడ్ పేర్కొన్నారు. గీత వృత్తి ప్రోత్సాహం కోసం తెలంగాణకు హరితహారంలో ఎక్సైజ్ శాఖ ఆధ్వర్యంలో సుమారు 4 కోట్ల 20 లక్షల తాటి, ఈత మొక్కలు నాటినట్లు శ్రీనివాస్ గౌడ్ గుర్తు చేశారు. తాటి, ఈత చెట్లను అక్రమంగా నరికి వేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

# కౌన్సిల్ హాల్‌లో 46 మంది బీజేపీ కార్పొరేటర్లు నిరసన

## –హాల్‌లో విద్యుత్ సరఫరా నిలిపివేసిన జీహెచ్ఎంసీ అధికారులు

## –బీజేపీ కార్పొరేటర్లు చీకట్లోనే నిరసన

హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బల్దియా ప్రధాన కార్యాలయం దగ్గర హైడ్రామా చోటు చేసుకుంది. కౌన్సిల్ హాల్‌లో 46 మంది బీజేపీ కార్పొరేటర్లు నిరసనకు దిగారు. జీహెచ్ఎంసీ అధికారులు హాల్?లో విద్యుత్ సరఫరా నిలిపివేశారు. దీంతో బీజేపీ కార్పొరేటర్లు చీకట్లోనే నిరసనకు దిగారు. కౌన్సిల్ భేటీలో సమస్యలపై చర్చించకుండానే వాయిదా వేయడం పట్ల కార్పొరేటర్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. జీహెచ్ఎంసీ ప్రధాన కార్యాలయానికి భారీగా బీజేపీ కార్యకర్తలు చేరుకుంటున్నారు.

జీహెచ్ఎంసీ కౌన్సిల్ సమావేశానికి వెళ్తున్న బీజేపీ కార్పొరేటర్లను పోలీసులు అడ్డుకున్నారు. దోమ వేషధారణలో ఉన్న మల్కాజ్ గిరి కార్పొరేటర్‌తో పాటు లైఫ్ జాకెట్లు వేసుకున్న కార్పొరేటర్లను పోలీసులు అడ్డుకున్నారు. లైఫ్ జాకెట్లు తొలగించి కౌన్సిల్ హాల్ లోపలికి వెళ్లాలంటూ పోలీసులు వార్నింగ్ ఇచ్చారు. ఈ క్రమంలోనే పోలీసులకు, బీజేపీ కార్పొరేటర్లకు మధ్య వాగ్వాదం చోటు చేసుకుంది.

చిన్న వర్షానికే అతలాకుతలవ ఎవుతున్న హైదరాబాద్ నగర ప్రజల ప్రాణాలకి రక్షణ లేదని, అందుకే జీహెచ్ఎంసీ కౌన్సిల్‌కి వెళ్తూ ఉండగా తన కుటుంబ సభ్యులు తన భద్రత గురించి లైఫ్ జాకెట్, స్విమ్మింగ్ ట్యూబ్ తదితర వస్తువులు ఇచ్చి జాగ్రత్తగా ఇంటికి తిరిగి రమ్మని పంపించారని సరూర్‌నగర్ కార్పొరేటర్ ఆకుల శ్రీవాణి మీడియాకు తెలిపారు.

మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, జీహెచ్ఎంసీ మేయర్ గద్వాల విజయలక్ష్మి ఇకనైనా తమ మొద్దు నిద్ర వదిలి హైదరాబాదులోని పెండింగ్ నాలా పనులు.. డ్రైనేజీ వ్యవస్థ తక్షణమే సరిదిద్ది ప్రజలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. లేదంటే రానున్న రోజులలో తమరే ప్రతి ఇంటికి ఇవి ఇవ్వాల్సి వస్తుందన్నారు. జీహెచ్ఎంసీ ఆదాయం ప్రతి సంవత్సరం పెరుగుతుందని, కానీ పనులు మాత్రం నత్తనడకన నడుస్తున్నాయని, కోట్ల రూపాయల ప్రజాధనం ఎక్కడికి పోతుంది? అని ఆకుల శ్రీవాణి ప్రశ్నించారు.

# మే డే పురస్కరించుకొని100 మంది కార్మికులకు కొత్త బట్టలు పంపిణి

హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూస్);మే డే పురస్కరించుకొని హేల్ టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ చైర్ పర్సన్ కాకుమాను జ్యోతి ఆధ్వర్యంలో తార్నాక లో 100 మంది కార్మికులకు కొత్త బట్టలు పంపిణి చేసారు. ఈ కార్యక్రమం లో తార్నాక బిఆర్ఎస్ నాయకుడు రాజనరసింహ ,చారిటీ సభ్యులు జగదాంబ. శాంతి. నునీత రెడ్డి. కె. ప్రవీణ్ కుమార్ శాంత తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జ్యోతి మాట్లాడుతూ మా టాటా మణి ఛారిటబుల్ ట్రస్ట్ నిరుపేదలకు ఎల్లవేళలా అండగా ఉంటుందని చెప్పారు. ఇప్పటికే అనీక ప్రాంతాల్లో పేదలకు కొత్త బట్టలు, విద్యార్థులకు పుస్తకాలు, వృద్దులకు దుప్పట్లు, రంజాన్ సందర్భంగా ముస్లిం సోదరులకు కొత్త బట్టలు పంపిణి చేసినట్లు తెలిపారు. దాతల సహాయం, ప్రోత్సహం ఉంటె బవిషత్ లో మరిన్ని సీవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు.

# తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి- జిల్లా కలెక్టర్



కామారెడ్డి జిల్లా 4 మే 23, (నేటి నిజం ప్రతినిధి)తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు.

రిజె కామారెడ్డి కలెక్టరేట్లో గురువారం యాసంగి ధాన్యం కొనుగోళ్లపై బాన్సువాడ నియోజకవర్గం మిల్లర్లతో సమీక్ష నిర్వహించారు. కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చిన తడిసిన ధాన్యాన్ని మిల్లర్లు దించుకోవాలని తెలిపారు. తడిసిన ధాన్యం ను తీసుకోకపోతే మిల్లర్లపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. లక్ష్యానికి అనుకూలంగా మిల్లింగ్ చేయాలని సూచించారు.

కొనుగోలు కేంద్రాల్లో ఉన్న తడిసిన ధాన్యాన్ని సహకార, వ్యవసాయ అధికారులు అంచనా వేయాలని పేర్కొన్నారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ చంద్రమోహన్, జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కంచర్ల లింగం, ప్రతినిధులు పాల్గొన్నారు.

# కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి జాన్ బార్లకు ఇజ్రాయిల్ పెట్టి రోస్ అనే బహుమతి

న్యూ ఢిల్లీ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);ఇజ్రాయిల్ దేశపు 75 వ స్వాతంత్ర దినోత్సవ సంబరాల్లో భాగంగా ఇండో ఇజ్రాయిల్ ఫ్రెండ్షిప్ అసోసియేషన్ జాతీయ అధ్యక్షులు డాక్టర్ ఆడం రాజ్ డెక్కపాటి మరియు బిజెపి రాష్ట్ర మైనార్టీ మోర్చా మీడియా కన్వీనర్ డాక్టర్ ఐజాక్ రాజ్ ఇజ్రాయిల్ దేశపు పెట్టి రోస్ అనే బహుమతిని ఇజ్రాయిల్ తరపున కేంద్ర మైనార్టీ శాఖ మంత్రి జాన్ బార్లకు ఢిల్లీలోని వారి స్వగృహంలో అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి జాన్ బార్ల మాట్లాడుతూ ఇరుదేశాల మైత్రి సంబంధానికి కృషి చేయాలని క్రైస్తవుల సమస్యలను పరిష్కరించడానికి తాను ఎప్పుడూ ముందు ఉంటానని హామీ ఇచ్చారు.

# నేషనల్ హైవే ఆఫ్ ఇండియా రూల్స్ ప్రకారమే ఓఅర్ ఆర్ టెండర్లను జారీ

హైదరాబాద్ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: నేషనల్ హైవే ఆఫ్ ఇండియా రూల్స్ ప్రకారమే ఓఅర్ ఆర్ టెండర్లను జారీ చేసినట్లు HMDA కమిషనర్ అరవింద్ కుమార్ తెలిపారు. ఓ ఆర్ ఆర్ బిడ్డింగ్ అంతర్జాతీయ స్థాయిలో జరిగిందన్నారు. టోల్ ఫ్రీ రూల్స్ 2008 ప్రకారమే టోల్ చార్జెస్ వసూళ్లు చేస్తున్నట్లు తెలిపారు. 30 ఏళ్ల పాటు ఓ ఆర్ ఎవరికి అప్పగిస్తామో వాళ్లదే పూర్తి బాధ్యత అని చెప్పారు. కేబినెట్ ఆమోదం తరువాతే ప్రభుత్వం అంతర్జాతీయ టెండర్లను ఆహ్వానించిందన్నారు. ఓ ఆర్ ఆర్ బిడ్డింగ్ అంతర్జాతీయ స్థాయిలో జరిగిందని, ఎవరైనా బిడ్డింగ్ వెసుకోవచ్చన్నారు. ప్రైవేట్ వ్యక్తులు ఇష్టమొచ్చినట్లు టోల్ వసూలు చేస్తున్నారనడం సరికాదన్నారు.

# పద్మశ్రీ అవార్డులు పొందిన మహిళల పాదాలు మొక్కిన ప్రధాని

బెంగళూరు మే 4 (ఎక్స్ప్రెస్ న్యూస్):: కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అంకోలాలో పర్యటించారు. అక్కడ ఆయన బహిరంగసభ వేదికపై పద్మశ్రీ అవార్డ్ విజేతలైన తులసీ గౌడ సుక్రి బొమ్మ గౌడను) కలుసుకున్నారు. క్షేమ సమాచారాలు అడిగాక వారి పాదాలకు మోదీ నమస్కరించారు.

తన పాదాలకు మొక్కేందుకు సుక్రి యత్నించగా మోదీ వారించారు. పర్యావరణ పరిరక్ష కురాలిగా తులసి గౌడ 2021లో నాటి రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ చేతుల మీదుగా పద్మశ్రీ అందుకు న్నారు. 30 వేలకు పైగా మొక్కలను ఆమె నాటారు. తులసి గౌడ కర్ణాటక లోని హాళక్కి గిరిజన తెగకు చెందినవారు. అనేక రకాల వన మూలికలు, అడవిలో పెరిగే అరుదైన మొక్కలకు సంబంధించిన పరిజ్ఞానం ఆమెకుంది.

మరోవైపు సుక్రి బొమ్మగౌడ హాళక్కి వొక్కలిగ గిరిజన తెగకు చెందిన వారు.

జానపద పాటల జాబితాలో ఆమె 2017లో పద్మశ్రీ గెలుచుకున్నారు. మరోవైపు కర్ణాటకలో ప్రచారంలో భాగంగా ప్రధానీ మోదీ కలబురగిలో మెగా రోడ్ షో నిర్వహించారు.

రోడ్లకు ఇరువైపులా నిల్చున్న అభిమానులు, ప్రజలు ప్రధానిపై పూల వర్షం కురిపించారు. ట్రక్‌పై ప్రయాణిస్తూ ప్రధాని ప్రజలకు అభివాదం చేశారు. ఈ సందర్భంగా తనకు ఎదురైన చిన్నారులతో మోదీ సంభాషించారు. పెద్దయ్యాక ఏం కావాలనుకుంటున్నారని ప్రశ్నించారు. అందులో ఒకరు డాక్టర్ కావాలని, మరొకరు పోలీస్ ఆఫీసర్ కావాలనుందని చెప్పారు. ప్రధాని కావాలని ఎవరికీ లేదా అని ప్రశ్నించగా మీలా కావాలనుందని ఓ చిన్నారి చెప్పారు .అధికారంలోకొస్తే బజరంగ్‌దళ్‌ను బ్యాన్ చేస్తామని కాంగ్రెస్ పార్టీ తమ మ్యానిఫెస్టోలో ప్రకటించడంతో ప్రధాని మండిపడుతున్నారు. ప్రతి సభలోనూ ఆయన బజరంగ్ బలీకి జై అంటూ నినాదాలు చేయిస్తున్నారు. హనుమంతుడు పుట్టిన నేలపై హనుమంతుడికి జై అంటే నిషేధిస్తారట అంటూ మోదీ ప్రచారం చేస్తున్నారు.

# తాను తెలంగాణ ప్రజలకుకు సేవ చేయడానికే వచ్చా

## – రాజకీయాలు చేయడానికి కాదు: గవర్నర్ తమిళిసై

హైదరాబాద్ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూస్);: తాను తెలంగాణ కు సేవ చేయడానికే వచ్చానని, రాజకీయాలు చేయడానికి కాదని ప్రకటించారు. రాష్ట్ర ప్రభుత్వం మొదటి నుంచి తనపై వ్యతిరేక వైఖరి ప్రదర్శిస్తోందని తమిళిసై విమర్శించారు. ప్రభుత్వం కొత్తగా నిర్మించిన సచివాలయాన్ని ఏప్రిల్ 30న ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రారంభించిన విషయం తెలిసిందే. రాష్ట్రంలో అత్యున్నత రాజ్యాంగ పదవికి ఇవ్వాల్సిన గౌరవ మర్యాదలు ప్రభుత్వం ఇవ్వడం లేదని రాజ్‌భవన్ వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. ఇప్పుడు ఇదే అంశంపై గవర్నర్, ప్రభుత్వంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. సచివాలయ ప్రారంభానికి తనకు ఆహ్వానం రాలేదని తెలిపారు. రాష్ట్ర ప్రథమ పౌరురాలిగా ప్రభుత్వం ఎప్పుడూ ప్రొటోకాల్ పాటించలేదని తప్పుబట్టారు. కాగా, ప్రభుత్వ సొమ్ముతో నిర్మించిన సచివాలయాన్ని ప్రారంభిస్తున్నప్పుడు గవర్నర్‌ను, ప్రతిపక్షాల నేతలను, పాత్రికేయులను ఆహ్వానించాల్సి ఉండగా.. ప్రభుత్వం కొన్ని వర్గాలను నిర్లక్ష్యం చేయడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. పక్కా ప్రభుత్వ, ప్రజా కార్యక్రమమైనా సర్కారు ప్రొటోకాల్ పాటించలేదు. రాష్ట్ర గవర్నర్‌ను ఆహ్వానించలేదు. కొన్ని మీడియా సంస్థలపైనా ఆంక్షలు విధించింది. (

పతిపక్షాల నేతలకూ ప్రభుత్వం సరైన విధానంలో ఆహ్వానం పంపలేదు. ఇంటి గోడకు లేదా తలుపులకు కోర్టు నోటీసులు అంటించినట్లు.. ప్రతిపక్షాల నేతల ఇళ్ల ముందు ఆహ్వాన పత్రాలను పడేసి వెళ్లారన్న ఆరోపణలున్నాయి. రాష్ట్రానికి పెద్ద దిక్కు అయిన గవర్నర్‌కు కూడా ప్రొటోకాల్ ప్రకారం ఆహ్వానం పంపలేదు. ఈ విషయాన్ని గవర్నరే మంగళవారం స్వయంగా ప్రకటించిన విషయం తెలిసిందే.

సచివాలయ నిర్మాణంపై భిన్నాభిప్రాయాలు

సచివాలయ నిర్మాణ విషయంలో మొదటి నుంచి ప్రభుత్వానికి, ప్రతిపక్షాలకు భిన్నాభిప్రాయాలు ఉన్నాయి. పాత సచివాలయం బాగానే ఉందని, దాన్ని కూల్చవద్దని ప్రతిపక్ష పార్టీలు చెప్పాయి. ఇంత భారీగా ఖర్చు చేసి కొత్త సచివాలయాన్ని నిర్మించాల్సిన అవసరం లేదని విమర్శించాయి. సచివాలయ భవన నిర్మాణ నిధులతో రాష్ట్రంలో నూతనంగా ఆస్పత్రులను నిర్మించాలని ప్రతిపక్షాలు సూచించాయి. కానీ, ప్రభుత్వం పట్టించుకోలేదు. ఈ నేపథ్యంలో విపక్షాలు కొత్త సచివాలయ ప్రారంభ కార్యక్రమానికి హాజరు కాలేదు. ఇక గవర్నర్ తమిళిసైతో రాష్ట్ర ప్రభుత్వానికి సత్సంబంధాలు లేవు. గత కొంత కాలంగా ప్రభుత్వం తీసుకుంటున్న పలు నిర్ణయాలను గవర్నర్ వ్యతిరేకించారు. అసెంబ్లీలో ఆమోదించిన బిల్లులపైనా గవర్నర్, ప్రభుత్వం మధ్య వివాదం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో సచివాలయ ప్రారంభోత్సవానికి గవర్నర్ గైర్హాజరయ్యారు.

# జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలి

## – సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ

హైదరాబాద్ మే 3 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: సీఎం కేసీఆర్‌కు రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు బండి సంజయ్ లేఖ రాశారు. జూనియర్ పంచాయతీ కార్యదర్శులను తక్షణమే రెగ్యులరైజ్ చేయాలని, వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ... గత 6 రోజులుగా రాష్ట్రంలోని 9350 మంది జూనియర్ పంచాయితీ కార్యదర్శులు ఆందోళన చేస్తున్నారని తెలిపారు. వారి ఉద్యోగాలను రెగ్యులరైజ్ చేయాలనే డిమాండ్ అత్యంత సమంజసమైనదన్నారు. తెలంగాణలో ఇకపై కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగి అనే పదమే ఉండదని అసెంబ్లీ సాక్షిగా మీరే ప్రకటించారని గుర్తుచేశారు. నూతన సచివాలయ భవన ప్రారంభోత్సవం నాడు కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేస్తూ సంతకం చేసినట్లు వార్తలు వచ్చాయని, కానీ పోటీ పరీక్షల్లో రాసి అర్హత సాధించి ఉద్యోగంలో చేరిన జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పదవీ కాలం పూర్తయి నాలుగేళ్లు దాటినా వారిని ఇంతవరకు రెగ్యులరైజ్ చేయకపోవడం అన్యాయమని లేఖలో ఆయన పేర్కొన్నారు. మూడేళ్ల ప్రొబేషనరీ కాలాన్ని నాలుగేళ్లకు పొడిగించినప్పటికీ అన్నింటినీ భరిస్తూ విధులు నిర్వర్తించారన్నారు. గడువు దాటినా నేటికీ వారిని రెగ్యులరైజ్ చేయకపోవడం దారుణమని లేఖ ద్వారా తెలిపారు.

పారిశుద్ధ్యం, పరిశుభ్రత, గ్రామాల అభివృద్ధి వంటి అంశాల్లో తెలంగాణలోని గ్రామ పంచాయతీలకు అవార్డులు వస్తున్నాయని జబ్బలు కొట్టుకుంటున్న ప్రభుత్వం అందులో కీలక పాత్ర వహిస్తున్న ప్రొబేషనరీ పంచాయతీ కార్యదర్శుల సమస్యలను ఏ మాత్రం పట్టించుకోకపోవడం అన్యాయమన్నారు. గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనులైన నర్సరీలు, వైకుంఠధామాలు, డంపింగ్ యార్డులు, ఇంకుడు గుంతలు, మరుగుదొడ్ల నిర్మాణాలు, పల్లె ప్రకృతి వనాలు, రైతు వేదికలు, క్రీడా ప్రాంగణాలు, కిచెన్ గార్డెన్‌లతోపాటు పల్లె ప్రగతి, హరితహారం, స్వచ్ఛ భారత్ కార్యక్రమాల అమలులో జూనియర్ పంచాయతీ కార్యదర్శుల పాత్ర క్రియాశీలమన్నారు. రోజుకు 12 గంటలకుపైగా పని చేస్తున్న వీరితో వెట్టిచాకిరి చేయించుకున్నారే తప్ప నేటికీ ఉద్యోగ భద్రత కల్పించకపోవడం దారుణమన్నారు. పైగా రెగ్యులర్ పంచాయతీ కార్యదర్శులకు, వీరికి మధ్య వైరం పెట్టేలా చర్యలున్నాయన్నారు. ఇప్పటికే ప్రభుత్వ నిర్వాకం వల్ల గ్రామానికి వెన్నుముకలైన సర్పంచుల్లో కొందరు చేసిన పనులకు బిల్లులు రాక అప్పులపాలై ఆత్మహత్య చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం ప్రొబేషనరీ కార్యదర్శులు సమ్మె చేసే దుస్థితి రావడం ప్రభుత్వ చేతగానితనానికి నిదర్శనమన్నారు. మీరు మాత్రమే శ్వేత సౌధంలో సేద తీరితే సరిపోదు. ప్రజల, ఉద్యోగుల బాగోగులను పట్టించుకోవాలని సూచించారు. ఇకనైనా మొద్దునిద్ర వీడి జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు.

# బాలినేని శ్రీనివాస్‌కు వైసీపీ చెక్?..

అమరావతి మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ఇటీవలే ప్రాంతీయ సమన్వయకర్త పదవికి రాజీనామా చేసిన మాజీ మంత్రి, ఒంగోలు వైసీపీ ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాస్ రెడ్డిని ఆ పార్టీ నమ్మడం లేదా?. ఆయన పార్టీని వీడడం ఖాయమని అనుమానిస్తోందా?. నియోజకవర్గానికే పరిమితమవుతానంటూ స్వయంగా సీఎం జగన్ వద్దే వివరణ ఇచ్చుకున్నా నమ్మకం కుదరడం లేదా?. ఇప్పటికే పార్టీని వీడిన ఎమ్మెల్యేలు ఆనం రామనారాయణ రెడ్డి, కోటం శ్రీధర్ రెడ్డి, మేకపాటి చంద్రశేఖర్ రెడ్డి, ఉండవల్లి శ్రీదేవి బాటలోనే బాలినేని కూడా పయనిస్తారని భావిస్తోందా?. ఈ పరిణామమే జరిగితే అధికార పార్టీకి మరో దెబ్బ ఖాయమని వైసీపీ నాయకత్వం ఆందోళన చెందుతోందా?. ఆయన పార్టీ వీడక ముందే తామే పార్టీ నుంచి గెంటి వేశామనేందుకు ప్లాన్స్ సిద్ధం చేసుకుందా?. ఈ మేరకు వైసీపీ సోషల్ మీడియా ప్రయత్నాలు మొదలయ్యాయా?... అంటే ఔననే భావన కలిగించే కీలక పరిణామాలు తెరమీదకు వచ్చాయి. వైసీపీలో హాట్‌టాపిక్‌గా మారింది.

రాజకీయ పార్టీ ఏదైనా అసంతృప్తులు సర్వసాధారణం. ఎంతకీ చల్లారని సందర్భాల్లో స్వయంగా పార్టీ అధినేతలే రంగంలోకి బుజ్జగించడం పరిపాటి. కానీ బాలినేని అసంతృప్తి ఎపిసోడ్‌లో ఇలాంటి పరిస్థితి కనిపించడం లేదు. రెండు రోజుల క్రితమే సీఎం జగన్‌ను కలిసి పార్టీ సమన్వయ కర్త పదవి నుంచి తప్పుకోవడంపై బాలినేని వివరణ ఇచ్చుకున్నా సమస్య సద్దుమణిగినట్టు కనిపించడం లేదు. జగన్ – బాలినేని మధ్య 40 నిమిషాలపాటు చర్చ జరిగింది. ఇలా చేస్తే తప్పుడు సంకేతాలు వెళ్తాయని జగన్ చెప్పినా బాలినేని దిగిరాలేదు. ఆరోగ్యం బాగాలేని కారణంగా నియోజకవర్గానికి మాత్రమే పరిమితమవుతానంటూ తేల్చిచెప్పారు. దీంతో 'నీ ఇష్టం' అంటూ జగన్ ఆయన్ను పంపించారు. అయితే ఈ కీలక భేటీ ముగిసిన తర్వాత వైసీపీ అనుకూల సోషల్ మీడియాలో బాలినేని వ్యతిరేక ప్రచారం మొదలైంది. బాలినేనిని పొమ్మనలేక పొగబెడుతున్నారా? అని అనుమానం కలిగేలా పోస్టులు కనపడుతున్నాయి. ఈ కోవకే చెందిన ఓ వీడియో ప్రస్తుతం హాట్‌టాపిక్‌గా మారింది.

బాలినేని పేకాట తప్ప.. సేవ చేసింది లేదు..!

బాలినేనిపై రాజకీయ ఆరోపణలు చేస్తూ వైసీపీ అనుకూల ఓ యూట్యూబ్ ఛానల్ రూపొందించిన ఓ వీడియో ఆసక్తికరంగా మారింది. బాలినేనికి విషయం తక్కువ, పేకాట, ఇంకో ఆట ఎక్కువ అని వైసీపీ మార్క్ నిందలు ఆ వీడియోలో కనిపించాయి. "ఆయన పేకాట, ఇంకో ఆట నిత్యం ఆడుతుంటారు. కానీ ప్రజల్లోకి వెళ్లమంటే ఆరోగ్యం బాగాలేదని చెబుతుంటారు" అని ఆరోపణలు గుప్పించారు. "వై నాట్ 175 అని జగన్మోహన్ రెడ్డి భావించినప్పుడు పార్టీని ప్రక్షాళన చెయ్యాలి. పని చెయ్యలేని వాళ్లు, సేవ చెయ్యలేని వాళ్లకు విలువ ఇవ్వకూడదని జగన్ భావిస్తున్నారు. అందులోనా కుటుంబం నుంచే ప్రక్షాళన మొదలుపెట్టాలని జగన్ చూస్తున్నారు. ఏదో మనోడని రాజశేఖర్ రెడ్డి సీటు ఇస్తే గాలి వాటాన బాలినేని గెలిచారు. బాలినేని మీడియాకు లీకులిస్తూ.. పవన్ కళ్యాణ్‌తో ఫొటోలు దిగుతుంటారు.

ఒంగోలులో కమ్మలు, కాపుల్లోని నేతలను దగ్గరకు తీసుకుని పేకాట ఆడుతుంటారు. అలాంటోళ్ల మీద ఆధారపడి కాళ్లమీద కాళ్లు వేసుకుని వడుకుంటే ఓట్లు వడవు. ఇంతకుమించి బాలినేనికి క్వాలిఫికేషన్ ఏమీ లేదు. ప్రజలకు సేవ చేసిన దాఖలాలు లేవు. సొంత కుటుంబ సభ్యుడికి న్యాయం చేయలేని వాడు. ఒంగోలులో ఎవరిని అడిగినా ఆయన మీద చాలా కంప్లైంట్లు ఉన్నాయంటున్నారు. సంవత్సరం నుంచి రకరకాల ఆరోపణలు వస్తున్నాయి. ప్రజలకు సేవ చేయడం ఆయన వల్ల కాదు. కొత్త రాజకీయాలకు నువ్వు వనికిరావు. రాజీనామా చేయాలనుకుంటే జగన్‌కు చెప్పి చేయాలి. మీడియాకు లీకులు ఇవ్వడం ఏంది?" అని ఆ వీడియోలో బాలినేనిపై ఆరోపణలు గుప్పించారు. దీంతో ఏపీ పాలిటిక్స్‌లో ఈ వీడియో హాట్ టాపిక్‌గా మారింది. పార్టీలో ఎలాంటి చర్చ, ఎవరి ఆదేశాలు లేకుండానే ఇలాంటి ప్రచారాలు చేస్తారా అంటూ ఒంగోలు నియోజకవర్గంలో టాక్ వినిపిస్తోంది.

కాగా సీఎం జగన్ పర్యటనలో ప్రొటోకాల్ ఎపిసోడ్, తన జిల్లాకే చెందినవారిని మంత్రి పదవుల్లో కొనసాగిస్తూ తనని మాత్రం పక్కనపెట్టడం, కనీసం కోరిన డీఎస్పీని కూడా కేటాయించకపోవడం బాలినేని అసంతృప్తికి కారణాలని ప్రచారం జరిగింది. పార్టీ ప్రాంతీయ సమన్వయకర్త పదవికి రాజీనామా చేయడానికి ఈ పరిణామాలే దారితీశాయని చర్చ నడిచింది. ఈ క్రమంలోనే పార్టీకి కూడా రాజీనామా చేయొచ్చనే ఊహాగానాలు చక్కర్లు కొట్టాయి. ఆఖరికి సీఎం జగనే నేరుగా రంగంలోకి దిగినా ఈ తరహా ప్రచారం జరుగుతుండడం ఆసక్తికరంగా మారింది. సీఎం జగన్ బుజ్జగించిన తర్వాత ఈ పరిణామం దేనికి సంకేతం?. నిజంగానే ఆయన వైసీపీని వీడతారా? అనే చర్చ మొదలైంది. మరి బాలినేని కేంద్రంగా వైసీపీలో జరుగుతున్న ఈ కీలక పరిణామం ఎటువైపు దారితీస్తుంది, ఈ ప్రచారం ఏవిధంగా ముగుస్తుందో వేచిచూడాలి.

# అవయవ దాన విధానాన్ని సమీక్షించిన కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ

న్యూఢిల్లీ, మే4:భవిష్యత్తు అవసరాలకు అనుగుణంగా అవయవ దాన విధానంలో సమూల సమగ్ర మార్పులు తెచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి డాక్టర్ మన్సుఖ్ మాండవీయ వెల్లడించారు. అవయవ దానం విధానం అమలు జరుగుతున్న తీరును మంత్రి ఈరోజు ఆరోగ్య శాఖ ఉన్నతాధికారులతో సమీక్షించారు. సమావేశంలో కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి డాక్టర్ భారతీ ప్రవీణ్ పవార్ కూడా సమావేశంలో పాల్గొన్నారు. అవయవ దానం, అవయవ మార్పిడి రంగాల్లో సమూల మార్పులు తీసుకు రావడానికి అధికారులు చర్యలు తీసుకోవాలని డాక్టర్ మాండవీయ సమావేశంలో ఆదేశాలు జారీచేశారు.

అవయవ దానం చేయడానికి ముందుకు వచ్చి తోటి మానవుల ప్రాణాలు రక్షించడానికి కృషి చేయాలని ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ 99వ సారి నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమం ద్వారా దేశ ప్రజలకు పిలుపునిచ్చారు. ప్రధాన మంత్రి ఇచ్చిన పిలుపుకు ప్రజలు సానుకూలంగా స్పందించడంతో అవయవదానానికి కొత్త ఊపు వచ్చింది. దేశంలో అవయవ దానాల సంఖ్య మూడు రెట్లు పెరిగింది. దేశంలో 2013లో 5000 కంటే తక్కువ సంఖ్యలో అవయవ దానాలు జరిగాయి. 2022 లో అవయవ దానాల సంఖ్య 15000 కు మించి ఉంది. జాతీయ, ప్రాంతీయ, రాష్ట్ర స్థాయిలో పనిచేస్తున్న అవయవ మార్పిడి సంస్థల ఆర్గాన్, టిష్యూస్ నెట్‌వర్క్ మధ్య సమన్వయం పెరగడంతో మరణించిన దాతకి చెందిన ఎక్కువ అవయవాలు ఉపయోగించబడుతున్నాయి. 2016 లో మరణించిన 930 మంది దాతల నుంచి సేకరించిన 2265 అవయవాలు అవసరం ఉన్నవారికి అందించారు. 2022 లో మరణించిన 904 మంది దాతల నుంచి సేకరించిన 2765 అవయవాలను ఉపయోగించారు. ఆసుపత్రుల్లో అవయవ దానం, మార్పిడి కార్యక్రమం అమలు కోసం దశల వారీగా ట్రాన్స్‌ప్లాంట్ మార్గదర్శకాలు రూపొందించే అంశంపై జాతీయ అవయవ దాన సంస్థ పనిచేస్తోంది. ట్రాన్స్‌ప్లాంట్ కోఆర్డినేటర్ల శిక్షణ కోసం ప్రామాణిక కోర్సు ప్రారంభించే ప్రతిపాదన సంస్థ పరిశీలనలో ఉంది. ఈ రెండు అంశాలకు సంబంధించిన వివరాలు త్వరలో విడుదల చేయనున్నారు. కార్యక్రమాన్ని పటిష్టంగా అమలు చేయడానికి సమన్వయం, ఐఈసీ, శిక్షణ మరియు మానవ వనరులు అభివృద్ధి కోసం నాలుగు కార్యక్రమాలు సిద్ధం అయ్యాయి. మరొక వ్యక్తి కి అవయవ దానం చేసిన ఉద్యోగులకు 42 రోజుల వరకు ప్రత్యేక సాధారణ సెలవులు మంజూరు చేస్తూ కేంద్ర ప్రభుత్వం ఇటీవల ఉత్తర్వులు జారీ చేసింది. ప్రజా ప్రయోజనాల కోసం ప్రత్యేక సంక్షేమ చర్యగా కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది.

డాక్టర్ మాండవీయ మార్గదర్శకత్వంలో ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ దేశంలో అవయవ దానం మరియు మార్పిడిని పెంపొందించడానికి తదుపరి విధాన పరమైన సంస్కరణలు అమలు చేయడం కోసం అంతర్జాతీయ ఉత్తమ విధానాలను అధ్యయనం చేయాలని నిర్ణయించింది.

# దేశంలోనే తొలి జాతరగా గంగమ్మ జాతర ప్రాముఖ్యం - సతీష్ రెడ్డి



తిరుపతి, మే4:దేశంలోనే తొలి జాతరగా గంగమ్మ జాతర ప్రాముఖ్యం సంతరించుకుందని, ఇక్కడి నుంచి మొదలైనట్లు ఆధారాలు ఉన్నాయని రక్షణ శాఖ సలహాదారుడు డాక్టర్ సతీష్ రెడ్డి తెలిపారు. కుటుంబ సభ్యులతో శ్రీ తాతయ్య గుంట గంగమ్మ దేవాలయాన్ని కుటుంబ సమేతంగా కుంభాభిషేక మహోత్సవంలో పాల్గొనటానికి విచ్చేసిన ఆయనకు స్థానిక ఎమ్మెల్యే, ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి, అనంతరం నిర్మాణంలో ఉన్న ఆలయ దర్శనం అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ పునర్ ప్రతిష్టాపన యజ్ఞం యాగాల్లో ఉన్న ప్రధాన కలశం వద్ద వేద యంత్రం, బంగారపు యంత్రంను వేద పండితులు నతీష్ రెడ్డి చేతులమీదుగా పూజలు నిర్వహించారు. అనంతరం రక్షణ శాఖ సలహాదారుడు డాక్టర్ సతీష్ రెడ్డి మాట్లాడుతూ గంగమ్మ తల్లి వైభవాన్ని తీసుకురావడానికి స్థానిక శాసనసభ్యులు చేస్తున్న కృషి చాలా అభినందనీయమన్నారు.

ప్రజలు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి పూజలు నిర్వహిస్తే గంగమ్మ దేవత ఆశీస్సులు అందరికీ ఉంటాయని వివరించారు. స్వయానా తిరుమల శ్రీ వెంకటేశ్వర స్వామి చెల్లెలు గంగమ్మ దేవతకు గత 700 సంవత్సరాలుగా జాతరలో నిర్వహించుకోవడం జరుగుతున్నదని గుర్తు చేశారు. దేశంలోనే జాతర ఇక్కడ నుంచే మొదలైనట్లు ఆధారాలు ఉన్నాయని వివరించారు. వెంకటేశ్వర స్వామి వారు తన చెల్లెలు గంగమ్మ దేవతకు సారె ఇవ్వడం ఆనవాయితీ దేశంలో ప్రతి కుటుంబంలో అక్కా చెల్లెళ్లకు సారె ఇవ్వడం మొదలైందన్నారు. ఆలయ పునరుద్దరణ ప్రతిష్ట కార్యక్రమానికి పీఠాధిపతులు స్వరూప నంద స్వామి, విజయేంద్ర సరస్వతి పాల్గొనడం జరుగుతుందని తెలిపారు. స్వామి వారి దర్శనానికి వచ్చే ముందు గంగమ్మ దేవతను దర్శించుకునే ఆచారం గుర్తుతెచ్చుకొని భక్తిశ్రద్ధలతో పూజించాలన్నారు. ఆఫ్కాన్స్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్, అధినేత ఎన్. రంగస్వామి ఐదు లక్షల రూపాయలను విరాళంగా స్థానిక శాసనసభ్యులు ఎమ్మెల్యే భూమన కరుణాకర్ రెడ్డి చేతులు ముందుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే కరుణాకర్ రెడ్డి, మేయర్ డాక్టర్ శిరీష, నగర కమిషనర్ హరిత, డిప్యూటీ మేయర్లు భూమన అభినయ్ రెడ్డి, ముద్ర నారాయణ, ఆలయ చైర్మన్ కట్ట గోపి యాదవ్, ఈవో మునికృష్ణయ్య, పాలకమండలి సభ్యులు వెంకటేశ్వరావు, హరినాథ్ రెడ్డి, దన శేఖర్, గీత, భారతి, కార్పొరేటర్లు ఎస్కె బాబు, నగర వైసిపి అధ్యక్షులు పాలగిరి ప్రతాప్ రెడ్డి పాల్గొన్నారు.

# తెలంగాణ హోంమంత్రికి ఢిల్లీ పోలీసులు షాక్

న్యూ ఢిల్లీ/హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్ అట్టహాసంగా ప్రారంభించారు. అనుకున్న ముహూర్తానికే అంటే సరిగ్గా మధ్యాహ్నం 1:05 గంటలకు కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎంపీలు, మంత్రులు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు. హోంమంత్రి మహమూద్ అలీ కి కూడా ఈ కార్యక్రమానికి హాజరుకావాలని పార్టీ ఆదేశాల ప్రకారం ఢిల్లీ వెళ్లారు. హైదరాబాద్ నుంచి విమానంలో ఢిల్లీ వెళ్లిన హోంమంత్రి ఎయిర్ పోర్టు నుంచి కారులో పార్టీ ఆఫీసుకు బయలుదేరారు. అయితే మహమూద్ అలీకి ఢిల్లీ పోలీసులు షాకిచ్చారు. అంతేకాదు ఆయన కారును అడ్డుకుని నడుచుకుంటూ వెళ్లాలని చెప్పారు. పాపం ఢిల్లీ పోలీసులకు మహమూద్ అలీ.. తెలంగాణ రాష్ట్రానికి హోం మంత్రి అనే విషయం తెలియదు. సాధారణ పౌరుడు అనుకుని ఆయనపై పోలీసులు జులుం ప్రదర్శించారు. ఇదంతా అవగాహనలేక పోవడం వల్ల జరిగిన పొరపాటు. ఇంతలోనే తాను హోంమంత్రిని అని చెప్పడంతో పోలీసులు కంగుతున్నారు. పొరపాటును సరిదిద్దుకుని ఆయనను అనుమతించారు.

ఇలాంటి అవమానాలు మహమూద్ అలీకి ఢిల్లీలోనే కాదు... స్వంత రాష్ట్రం, అది కూడా ప్రగతిభవన్‌లో గతంలో ఎదురైంది. ఆ సమయంలో కరోనా తీవ్రంగా ఉంది. కరోనాను కట్టడి చేసేందుకు ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్ సమీక్ష నిర్వహిస్తున్నారు. ఈ సమావేశానికి అతికొద్ది మందికి మాత్రమే ఆహ్వానాలు పంపారు. మహమూద్ అలీ కూడా ఈ సమావేశంలో పాల్గొనేందుకు నేరుగా ప్రగతిభవన్ వెళ్లారు. అక్కడ ఉన్న భద్రతా సిబ్బంది ఆయనను అడ్డుకున్నారు. ఢిల్లీలో చెప్పినట్లే తాను హోంమంత్రినని మహమూద్ అలీ చెప్పారు. అయినా పోలీసులు ఆయనను అనుమతించలేదు. ఇక ఏమీ చేయలేక సమావేశంలో పాల్గొనకుండా ఆయన వెనుతిరిగారు.

మండిపడుతున్న మీడియా ప్రతినిధులు

ఇదిలావుంటే ఢిల్లీలో బీఆర్ఎస్ పార్టీ కేంద్ర కార్యాలయ ప్రారంభోత్సవాన్ని కవరేజ్ చేయడానికి వచ్చిన మీడియాకు బీఆర్ఎస్ కార్యాలయంలోకి అనుమతి లభించలేదు. అధికారుల ఆదేశాల మేరకు మీడియాను బీఆర్ఎస్ పార్టీ ఆఫీస్ ముందు నుంచి పోలీసులు బయటకు పంపించివేశారు. పార్టీ ఆఫీస్ ప్రాంగణంలో కూడా మీడియా వాళ్ళు ఎవరు ఉండవద్దంటూ హుకుం జారీ చేశారు. పైనుంచి ఆదేశాలు వచ్చాయని... అందుకోసమే మీడియాకు నో ఎంట్రీ అని ముఖ్యమంత్రి సెక్యూరిటీ సిబ్బంది చెబుతోంది. ఈ ఆంక్షలపై మీడియా ప్రతినిధులు మండిపడుతున్నారు.

## ఏప్రిల్‌లో నాలుగు శాతం తగ్గిన వెహికల్స్ సేల్స్ .. కారణం అదేనా?!

హైదరాబాద్, మే4:గత నెలలో వెహికల్స్ సేల్స్ ఓవరాల్‌గా 4.03 శాతం తగ్గుముఖం పట్టాయి. 2022 ఏప్రిల్‌లో 17,97,432 కార్లు అమ్ముడైతే, గత నెలలో 17,24,935 యూనిట్లకు మాత్రమే పరిమితం అయ్యాయి. కర్బన ఉద్గారాల నియంత్రణకు కేంద్రం తీసుకొచ్చిన రెండోదశ బీఎస్–6 ప్రమాణాల అమలు వల్లే వాహనాల విక్రయాలు తగ్గుముఖం పట్టాయని చెబుతున్నారు. ఆటోమొబైల్ డాలర్ల సంఘాల సమాఖ్య (ఫాడా) గురువారం గత నెల కార్ల విక్రయాల వివరాలు వెల్లడించింది. 2022తో పోలిస్తే కార్ల సేల్స్ ఒకశాతం తగ్గిపోయాయి. త్రీ వీలర్స్ సేల్స్ 57 శాతం పుంజుకుంటే, ట్రాక్టర్లు ఒకశాతం, కమర్షియల్ వెహికల్స్ సేల్స్ రెండు శాతం ఎక్కువయ్యాయి. రెండో దశ కర్బన ఉద్గార నిబంధనలు అమల్లోకి తేవడం వల్లే కార్ల సేల్స్ తగ్గాయని చెప్పారు ఫాడా ప్రెసిడెంట్ మనీశ్ రాజ్ సింఘానియా తెలిపారు. ఏప్రిల్ నుంచి కర్బన ఉద్గార నియంత్రణ నిబంధనలు కఠినతరం చేయడంతో కార్ల ధరలు పెరిగాయి. దీంతో చాలా మంది మార్చిలోనే కార్లు కొనుగోలు చేశారని మనీశ్ రాజ్ సింఘానియా తెలిపారు.

గత ఎనిమిది నెలల్లో తొలిసారి ఏప్రిల్‌లో కార్ల విక్రయాలు తగ్గుముఖం పట్టాయి. గతేడాది ఏప్రిల్ నెలలో 2,86,539 కార్లు అమ్ముడైతే, ఈ ఏడాది ఏప్రిల్ లో 2,86,539 కార్లు అమ్ముడైతే, ఈ ఏడాది 2,82,674 యూనిట్లకు పరిమితం అయ్యాయి. మారుతి సుజుకి 1.09 లక్షల కార్లు విక్రయించింది. దేశీయ కార్ల మార్కెట్‌లో మారుతి వాటా 38.89 శాతం.

# ఏపీఎస్ ఆర్టీసీకి ప్రయాణీకుల కళ - ఒక్కరోజే రూ .19 కోట్ల ఆదాయం..

అమరావతి, మే4:గత నెలలో విద్యార్థుల కు వరుస పరీక్షలుండట, సుముహూర్తాలు లేక పెళ్లిళ్లు, శుభకార్యాలు లేకపోవడంతో ఆర్టీసీ ఆదాయం నీర సించింది. ఓఆర్(ఆక్యుపెన్సీ రేషియో) భారీగా తగ్గి రోజువారి ఆదాయంలో రూ. 3 నుంచి రూ. 4 కోట్ల వర కు గండిపడింది. ఇప్పుడు వరుసగా రెండు నెలల పాటు శుభకార్యాలకు పెద్ద ఎత్తున ముహూర్తాలు ఉండ టం, విద్యార్థులకు వేసవి సెలవులు కావడంతో తిరిగి ఆర్టీసీ ఆదాయం పుంజుకోనుంది. గత రెండు నెలల తో పోల్చితే మే ఆరంభంలోనే ప్రయాణికుల సంఖ్య భారీగా పెరిగింది. కరెంట్, ఆన్‌లైన్ బుకింగ్‌లు పెరిగి బస్టాండ్లు ప్రయాణికులతో కళకళలాడుతున్నాయి. ఒక్క సోమవారం రోజే రికార్డు స్థాయిలో రూ. 19 కో ట్లు ఆదాయం రావడం పట్ల అధికారులు ఖుషీగా ఉన్నారు. రానున్న రెండు నెలల్లో ఇదే స్థాయిలో ఆదా యం ఉంటుందనే ఆశాభావాన్ని అధికారులు వ్యక్తం చేస్తున్నారు. పెళ్లిళ్లు, ఇతర శుభకార్యాలను దృష్టిలో ఉంచుకొని ఆర్టీసీ సర్వీసుల నిర్వహణ(ఆపరేషన్స్) లో సమస్యలు తలెత్తకుండా అధికారులు తగిన జాగ్ర త్తలు తీసుకుంటున్నారు. ఆర్టీసీ బస్సులను అన్ని రూట్లకు సిద్ధం చేయడం, ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు, బస్టాండ్లలో పరిశుభ్రత సహా అన్ని రకాల చర్యలు తీసుకుంటున్నట్లు పేర్కొంటున్నారు.

## మార్చి, ఏప్రిల్‌లో తగ్గిన ఆక్యుపెన్సీ..

ఆర్టీసీకి గత రెండు నెలలుగా ఆక్యుపెన్సీ రేషి యో తగ్గింది. గతంలో సగటును 69 శాతం వరకు ఉండే ఓఆర్ మార్చి, ఏప్రిల్ మాసాల్లో క్రమేపీ తగ్గు తూ 60శాతానికి దిగువకు పడిపోయింది. ఏప్రిల్ మాసంలో వివిధ రకాల పరీక్షలు ఉన్నాయి. ఇంటర్, పదో తరగతి, ఎంసెట్ వంటి పలు పరీక్షలు ఉండటంతో మార్చి నుంచే విద్యార్థులు, తల్లిదండ్రులు ప్రయాణా లకు దూరంగా ఉన్నారు. పైగా ఆ రెండు నెలల్లో సుముహూర్తాలు కూడా లేవు. ఒక వేళ ఉన్నా బంధువులు, ఇతరులు ఆయా కార్యక్రమాలకు వెళ్లే పరిస్థితులు లేవు. వివిధ కార్యాలకు వెళితే పిల్లల చదువు కుంటుపడుతుందనే అభిప్రాయంతో మెజా రిటీ ప్రయాణికులు వీటికి దూరంగానే ఉన్నారు. ఈ నేపథ్యంలో రోజువారీ ఆదాయం భారీగా తగ్గింది. సగటును రోజుకు రూ. 16.5 కోట్ల నుంచి రూ. 17.5 కోట్ల వరకు ఆదాయం వస్తుంది. రెండు నెలల్లో క్రమే పీ ఆదాయం తగ్గుతూ రూ. 13 కోట్లకు మించలేదని అధికార వర్గాల సమాచారం.

## ముహుర్తాలే ముహుర్తాలు..

రెండు నెలల పాటు పెద్ద ఎత్తున ముహూర్తాలు ఉన్నాయి. వివాహాలు, గృహ ప్రవేశాలు, శంఖుస్థాప నలు, ఉప నయనాలు(ఒడుగు) వంటివి పెద్ద ఎత్తున జరుగుతున్నాయి. ఆయా శుభ కార్యాల్లో పాల్గొనేం దుకు వివిధ ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున బంధుమి త్రులు తరలివస్తారు. ఇదే సమయంలో ఆయా కార్య క్రమాల్లో వివిధ రంగాలకు చెందిన వ్యక్తులు భాగస్వా ములు కావడంతో వీరు కూడా వివిధ ప్రాంతాలకు తరలివస్తుంటారు. హైదరాబాద్ సహా ప్రధాన పట్టణా ల్లో స్థిరపడిన వారంతా వివిధ వేడుకల్లో పాల్గొనేం దుకు గ్రామీణ ప్రాంతాలకు తరలి వెళుతుంటారు. పైగా వేసవి సెలవులు కూడా కలిసి రావడంతో ఎక్కువ మంది స్వస్థలాలకు వెళ్లడం రివాజు. ఈ క్రమంలోనే ఆర్టీసీ ఆదాయం పెద్ద ఎత్తున పెరుగుతుందని ఆర్టీసీ అధికారులు చెపుతున్నారు.

# మే 5 న ఐపిసి దివ్యాంగుల విభాగం రాష్ట్ర సమావేశం

హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);రాష్ట్రము లో దివ్యాంగుల సమస్యల పై చర్చించడానికి ఈ నెల 5 న మేడ్చల్ జిల్లా కీసర లోని శ్రీరామ లింగేశ్వర కాలనీ లో కి అన్ని దివ్యంగా సంఘాలతో సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఇండియన్ ప్రజా కాంగ్రెస్ దివ్యాంగుల విభాగం జాతీయ అధ్యక్షురాలు శివలెంక నాగ ఉదయలక్ష్మి తెలిపారు. రాజ్యాధికరం లో దివ్యాంగుల భాగస్వామ్యం సాధించాలి అంటే దివ్యాంగులు దివ్యంగా సంఘాలు జాతీయ స్థాయిలో పోరాడవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. దివ్యాంగుల సమస్యలకు కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు తీసుకోవడంలో విఫలం అవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేసారు.

జాతీయ స్థాయిలో వారి హక్కులు...చట్టాలు అమలు చేసేందుకు అక్ట్ ఇంప్లిమెంటేషన్ చేయడం మొదలగు అంశాలపై చర్చించడానికి ఈ సమావేశాన్ని ఏర్పాటు చిసినట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశానికి ముఖ్య అతిధి ఐపిసి జాతీయ అధ్యక్షుడు కేబి శ్రీధర్, అడ్వైజర్ నందూరి రమేష్ హాజరవుతున్నట్లు తెలిపారు.

# ఎ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ ఇన్ ఆర్ట్స్‌ని ప్రారంభించిన స్టార్టప్ 20

న్యూఢిల్లీ, మే4:ప్రపంచ ఐపీ దినోత్సవం సందర్భంగా జీ20 స్టార్టప్20 చైర్ డాక్టర్ చింతన్ వైష్ణవ్, పండిట్ జస్‌రాజ్ కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు శ్రీమతి దుర్గా జస్‌రాజ్‌తో కలిసి ఏప్రిల్ 26, 2023 న్యూఢిల్లీలోని నీతి ఆయోగ్‌లో ''యుపిఏజే:ఎ ఫెస్టివల్ ఆఫ్ ఇన్నోవేషన్ ఇన్ ఆర్ట్స్''ని ప్రారంభించారు. ఈ కార్యక్రమం పేటెంట్స్, డిజైన్స్ మరియు ట్రేడ్‌మార్క్‌ల కంట్రోలర్ జనరల్ కార్యాలయం ద్వారా నిర్వహించబడిన ఐపీ దినోత్సవ వేడుకల కార్యక్రమం. జీ20 షెర్పా శ్రీ అమితాబ్ కాంత్ వీడియో సందేశంతో ప్రారంభోత్సవ కార్యక్రమం మొదలయింది. "ఈ కార్యక్రమ భారతదేశ సాంస్కృతిక వారసత్వం కోసం ఐపీ మరియు కాపీరైట్‌ల యొక్క ప్రాముఖ్యత గురించి అవగాహనను కలిగిస్తుంది." అని తన వీడియో సందేశంలో శ్రీ అమితాంబ్ కాంత్ తెలిపారు.

అటల్ ఇన్నోవేషన్ మిషన్, నీతి ఆయోగ్ పెర్ఫార్మెన్స్ ఆర్ట్స్‌లో ఇన్నోవేషన్‌ను రక్షించడం మరియు దాని ప్రాముఖ్యత మరియు సవాళ్లపై ప్యానెల్ చర్చను నిర్వహించింది. కళాకారులు, ఆవిష్కర్తలు, మేధో సంపత్తి హక్కుల నిపుణులు, పర్యావరణ వ్యవస్థ బిల్డర్లు మరియు విధాన రూపకర్తల నుండి ఈ అంశానికి సంబంధించిన పలు రంగాలలో పనిచేస్తున్న వాటాదారులు చర్చలో పాల్గొన్నారు. ఈ చర్చను డాక్టర్ చింతన్ వైష్ణవ్ మోడరేట్ చేసారు. ఈ కార్యక్రమలో శ్రీమతి దుర్గా జస్రాజ్, పండిట్ జస్రాజ్ కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు; శ్రీ నీరజ్ జైట్లీ, పండిట్ జస్రాజ్ కల్చరల్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు; మాస్ట్రో నీలాద్రి కుమార్, సంగీతకారుడు, సితార్ మరియు జితార్; డా. దినేష్ పాటిల్, డిప్యూటీ కంట్రోలర్ ఆఫ్ పేటెంట్స్ అండ్ డిజైన్స్ మరియు హెడ్ ఆఫ్ ఆఫీస్ (టెక్నికల్); డా. పృథ్వాల్ కౌర్ సిద్ధు, డిప్యూటీ రిజిస్ట్రార్ ఆఫ్ ట్రేడ్ మార్క్స్ మరియు జీ.ఐ, హెడ్ – కాపీరైట్స్ ఆఫీస్, ఢిల్లీ; ప్రొ. అమోఘ్ దేవ్ రాయ్, సంరచన ఫౌండేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్; మరియు న్యాయవాది సవీనా బేడీ సచార్, వ్యవస్థాపకుడు మరియు మేనేజింగ్ పార్ట్‌నర్ – లావ్ అసోసియేట్స్ పాల్గొన్నారు.

కార్యక్రమంలో డాక్టర్ చింతన్ మాట్లాడుతూ "కళ మరియు సంస్కృతి విషయానికి వస్తే భారతదేశం ఒక పవర్‌హౌస్. ఈ రోజు మనం ప్రారంభించిన ప్లాట్‌ఫామ్ కళాత్మక వ్యక్తీకరణను జరుపుకునే ఉద్దేశ్యంతో పుట్టింది మరియు కళా రంగంలో ఆవిష్కరణలు చేస్తున్న వారికి మద్దతుగా ఒక పర్యావరణ వ్యవస్థను సృష్టించడం కార్యక్రమ లక్ష్యమన్నారు.

ఆయన ఈ ఉత్సవాన్ని పరిచయం చేస్తూ "కళలు ఉనికిలో ఉండటానికి ఒక స్థాయిలో వాస్తవికత మరియు సృజనాత్మకత అస్తిత్వం కారణం. మరొక స్థాయిలో స్వచ్ఛత మరియు ప్రామాణికతను మనం కళారూపాలకు విలువ ఇస్తాం" అనే అర్థాన్ని కూడా ఆయన సూచించారు. అలాగే "ఈ రంగం సమయం మరియు ప్రయోగాలతో అభివృద్ధి చెందుతోంది మరియు ఇతర రంగాల మాదిరిగానే, కళలు కూడా సాంకేతిక పరిణామం ద్వారా రూపాంతరం చెందాయి. ఇలాంటి ఫోరమ్ తమ ఆవిష్కరణలతో ఈ రంగంలో ముందుకు సాగుతున్న వ్యక్తులను జరుపుకోవాలని భావిస్తోంది." అని చెప్పారు.

పానెల్ డిస్కషన్‌లో శ్రీమతి దుర్గా జస్‌రాజ్ మాట్లాడుతూ "ఇన్నోవేషన్ కళతో కలిసి వెళ్తుంది. సాంకేతికత కారణంగానే దేశంలోని నలుమూలల ఉన్న కళాకారులు తమ స్వరాన్ని కనుగొనగలుగుతున్నారు. మరిన్ని డిజిటల్ ఫోరమ్‌లు కళను ప్రజల్లోకి తీసుకెళ్లడంలో కీలక పాత్ర పోషిస్తాయి" అని చెప్పారు.

మేస్ట్రో నీలాద్రి కుమార్ తన జితార్‌కు జన్మనిచ్చారు. తన అభిప్రాయాలను పంచుకుంటూ "మేధో సంపత్తి హక్కులు కళాకారుల పని యొక్క వాస్తవికతను గుర్తించడమే కాకుండా, కళాకారులకు రక్షణ కల్పించడానికి చట్టపరమైన ఫ్రేమ్‌వర్క్‌ను అందించడం ద్వారా పరిశ్రమలో ఆవిష్కరణలను ప్రోత్సహిస్తాయి" అని చెప్పారు.

పేటెంట్స్ అండ్ డిజైన్స్ డిప్యూటీ కంట్రోలర్ డా. దినేష్ పాటిల్ మేధో సంపత్తి కోణం గురించి చర్చిస్తూ "కళాకారుడు కళను కాపాడుకోవాలనుకుంటే కళ నేరుగా కాపీరైట్‌లకు అనుసంధానించబడి ఉంటుంది మరియు గరిష్ట రక్షణ కల్పించే చట్టాలు ఉన్నాయి" అని వ్యక్తపరిచారు.

జీ20 స్టార్టప్20 సమ్మిట్ సమావేశం ప్రణాళిక చేయబడినప్పుడు యూపిఏజే కార్యక్రమం జూలై మొదటి వారంలో ప్లాన్ చేయబడింది.

ఎయిమ్ అనేది ఆవిష్కరణ మరియు వ్యవస్థాపకత సంస్కృతిని ప్రోత్సహించడానికి భారత ప్రభుత్వం యొక్క ప్రయత్నం. ప్రపంచ స్థాయి ఆవిష్కరణ కేంద్రాలు, గొప్ప సవాళ్లు, ప్రారంభ వ్యాపారాలు మరియు ఇతర స్వయం ఉపాధి కార్యకలాపాలు ముఖ్యంగా సాంకేతికతతో నడిచే ప్రాంతాల్లో ప్రమోషన్ కోసం ఒక వేదికగా పనిచేయడం దీని లక్ష్యం.

# ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో వారంలో ఐదు రోజులు మాత్రమే పని

న్యూ ఢిల్లీ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్):మన దేశంలోని ప్రభుత్వ రంగ బ్యాంకుల్లో పనిచేసే ఉద్యోగులకు వారంలో ఐదు రోజులు మాత్రమే పనిచేసే వెసులుబాటు కల్పించాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించుకున్నట్లు తెలుస్తోంది. త్వరలో.. ఈ ప్రతిపాదనకు కేంద్ర ప్రభుత్వం ఆమోద ముద్ర వేయనున్నట్లు సమాచారం. వారానికి ఐదు రోజుల పని దినాల ప్రతిపాదనను ఇండియన్ బ్యాంక్ అసోసియేషన్ కేంద్ర ప్రభుత్వానికి పంపడం గమనార్హం. యునైటెడ్ ఫోరమ్ ఆఫ్ బ్యాంక్ ఎంప్లాయిస్ కూడా ఈ ప్రతిపాదన పట్ల హర్షం వ్యక్తం చేసింది. అయితే.. బ్యాంకు ఉద్యోగులు పని దినాలైన ఆ ఐదు రోజులు 40 నిమిషాల పాటు అదనంగా పనిచేయాల్సి ఉంటుంది. ప్రస్తుతం బ్యాంకు ఉద్యోగులకు నెలలో రెండు శనివారాలు, నాలుగు ఆదివారాలు సెలవు దినాలుగా ఉండటం గమనార్హం. వీటికి తోడు.. పబ్లిక్ హాలిడేస్ ఉండనే ఉంటాయి. తాజాగా.. వారానికి రెండు రోజులు సెలవు ప్రతిపాదన కూడా కేంద్రం ముందుకు రావడం, కేంద్ర ప్రభుత్వం సానుకూలంగా స్పందించడంతో ఈ ప్రతిపాదన కార్యరూపం దాల్చితే బ్యాంకు ఉద్యోగులు పండగ చేసుకోనున్నారు.

ఐటీ ఉద్యోగుల మాదిరిగా బ్యాంకు ఉద్యోగులు కూడా వారంలో రెండు రోజులు అధికారిక సెలవు తీసుకునేందుకు అవకాశం ఉంటుంది. ఇదిలా ఉండగా.. మే నెలలో దేశంలోని పలు ప్రాంతాల్లో బ్యాంకులు 11 రోజుల పాటు మూతపడనున్నాయి. బుద్ధ పూర్ణిమ, మహారాణా ప్రతాప్ జయంతి వంటి రోజులతో పాటు ప్రతి నెల ఉండే ఆదివారాలు, రెండు శనివారాల సెలవుల వల్ల మే నెలలో 11 రోజుల పాటు దేశంలోని పలు ప్రాంతాల్లో బ్యాంకులు మూతపడనున్నాయి. అయితే.. దేశవ్యాప్తంగా ఉన్న అన్ని బ్యాంకులకు సెలవులు ఒకే విధంగా ఉండవన్న విషయాన్ని గుర్తుంచుకోవాలి. ఈ విషయమై బ్యాంకింగ్ వర్గాల్లో జోరుగా చర్చ జరుగుతోంది.

# పొంగులేటితో ఈటల బృందం భేటి - బిజెపిలోకి ఆహ్వానం



ఖమ్మం, మే4: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర బిజెపి చేరికల కమిటీ చైర్మన్ ఈటెల రాజేందర్ నాయకత్వంలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావు, మాజీ ఎంపీ కొండ విశ్వేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎమ్మెల్యే ఏనుగు రవీందర్ రెడ్డి గురువారం ఖమ్మంలోని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తో భేటి అయ్యారు.. పొంగులేటి కార్యాలయానికి వచ్చిన ఈటల బృందానికి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డితో పాటు ఆయన అనుచరగణం ఘనంగా స్వాగతం పలికారు. ఆత్మీయ విందు భోజనం చేస్తూ రాష్ట్ర జిల్లా రాజకీయాలపై చర్చించారు. ఈ క్రమంలో బిజెపిలోకి రావాలని ఈటెల రాజేందర్.. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డిని ఆహ్వానించినట్లు సమాచారం. ఈ సందర్భంగా ఖమ్మంలో పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి క్యాంపు కార్యాలయం వద్ద కార్యకర్తలు, నాయకులతో సందడి నెలకొంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పరిషత్ చైర్మన్ కోరం కనకయ్య, డిసిసిబి మాజీ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, డిసిసిబి డైరెక్టర్లు తుల్లూరు బ్రహ్మయ్య, మేకల మల్లి బాబు యాదవ్, మాజీ ఎమ్మెల్యే పాయం వెంకటేశ్వర్లు, మార్క్ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా వెంకటేశ్వర్లు, క్యాంపు కార్యాలయం ఇంచార్జ్ తుంబూరు దయాకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఈ చీరలు.. మాకొద్దు.. మేయర్ ను నిలదీసిన మున్సిపల్ కార్మికులు



నిజామాబాద్, మే4: ప్రభుత్వం మున్సిపల్ కార్మికులకు పంపిణీ చేసిన డ్రెస్ కోడ్ చీరలను మాకొద్దు అంటూ మున్సిపల్ కార్మికులు నిజామాబాద్ నగర మేయర్ దండు నీతూ కిరణ్ నిలదీశారు. గురువారం మున్సిపల్ కార్పొరేషన్ కార్యా లయంలో నగర మేయర్ దండు నీతూ కిరణ్ మున్సిపల్ కార్మి కులకు బట్టల పంపిణి కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమానికి హాజరైన మున్సిపల్ కార్మికులు.. మేయర్ ఇచ్చిన చీరలను తమకు వద్దంటూ నిరసన తెలిపారు. తాము ఎండలో పని చేస్తామని ఈ చీరలు కట్టుకుంటే తాము ఇబ్బంది పడుతామని అసలే ఎండలు విపరీతంగా వున్నా యని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు క్వాలిటీ చీరలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మున్సిపల్ పారిశుద్ధ కార్మికులు ప్రశ్నిం చడంతో అక్కడి నుండి మేయ ర్ నీతూ కిరణ్ వెనుదిరిగారు. మేయర్ నీతూ కిరణ్ తీరుపట్ల కార్మికులు అసహనం వ్యక్తం చేస్తున్నారు.

# అకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని చెల్లించాలి

-తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

-సెక్రటేరియట్ ముట్టడికి బయలుదేరిన ప్రజా సంఘాలు

-అడ్డుకున్న పోలీసులు..అరెస్ట్

-రైతుల పక్షాన నిలబడితే అక్రమ అరెస్టులా!: ప్రొఫెసర్ కొందండరామ్

-అరెస్టు చేసిన వారిని వెంటనే బేషరతుగా విడుదల చేయాలి!: ఆకునూరి మురళి




హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్); ఆకాల వర్షానికి పంట నష్టపోయిన రైతులకు పరిహారాన్ని చెల్లించాలని, తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలని హైదరాబాద్ లోని సుందరయ్య విజా&జన కేంద్రం నుండి సెక్రటేరియట్ కు బయలుదేరి న వాలింటరి రిటైర్డ్ ఐఏఎస్ అధికారి ఆకునూరి మురళి, ప్రొఫెసర్ కొందండరావ్, క్రాంతి దళ్ అధ్యక్షులు పృధ్విరాజ్, బీసీ సంఘం అధ్యక్షులు బొల్క వెంకట్ యాదవ్,డిబిఎఫ్ జాతీయ కార్యదర్శి పి.శంకర్, రాష్ట్ర కార్యదర్శి పులి కల్పన,ఆర్ఎస్వి నాయకులు రవి, కిరణ్, ఎన్ఏపిఎం నాయకులు మీరా సంఘమిత్ర,టివివి నేత నాగన్న లను అక్రమ అరెస్టు ను దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తుం దని ,ప్రశ్నించే తత్వాన్ని అణిచివేయా లని చూస్తున్న ప్రభుత్వానికి తగిన గుణపాఠం చేప్పాలని,వెంటనే రాష్ట్ర వ్యాప్తంగా రైతుల వరిధాన్యానికి మద్దతు ధర ప్రకటించి,తడిసిన ధాన్యాన్ని యుద్ధ పాతిపాధికన కొనుగోలు చేసి రైతాంగాన్ని అదుకో వాలని,అరెస్టు చేసిన నాయకులందరిని వెంటనే విడుదల చేయాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.

# రాజకీయాల్లో రాత్రికి రాత్రే నిర్ణయం తీసుకోలేం...!

- ఆలస్యమైనా... ప్రజామోదయోగ్యం వైపే మొగ్గు

- ఎజెండా ఉంది.... జెండా ఎంటో త్వరలోనే వెల్లడిస్తాం

- బీజేపీ నేతలతో భేటీ అనంతరం మాజీ మంత్రి జూపల్లి,మాజీ ఎంపీ పొంగులేటి



ఖమ్మం, మే4: (నేటినిజం ప్రతినిధి): రాజకీయాల్లో రాత్రికి రాత్రే నిర్ణయం తీసుకోనే పరిస్థితి ఉండదు... ఆలస్యమని భావిస్తున్న వారందరికీ మా సమాధానం ఒక్కటే .... తప్పకుండా ప్రజామోదయోగ్యం వైపే మొగ్గు చూపుతామని మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాస రెడ్డిలు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి బీజేపీ నేతలతో గురువారం భేటీ ముగిసిన అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ... మభ్యపు మాటలతో మూడోసారి కూడా అధికారంలోకి రావాలని ప్రయత్నిస్తున్న రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ప్రభుత్వాన్ని అధికారంలోకి రానివ్వకపోవడమే తమందరి అంతిమ లక్ష్యమన్నారు. అందుకోసం రెండు మెట్లు కాదు... ఎన్ని మెట్లు దిగడానికైనా తాము సిద్ధమన్నారు. బీజేపీ, కాంగ్రెస్ కాదు ఇతరత్రా పార్టీల నుంచి కూడా ఆహ్వానం ఉందన్నారు.కేసీఆర్ ను అధికారంలోకి రానివ్వదనేదే తమ ప్రధాన ఎజెండా అని త్వరలోనే జెండా ఎంటో ప్రకటిస్తామని తెలిపారు.ప్రస్తుతం జరిగిన భేటిలో కేసీఆర్ ను నిలువరించేందుకు తాము ఏ విధంగా ముందుకు వెళ్తున్నామో బీజేపీ నేతలతో చర్చించినట్లు తెలిపారు.వారు కూడా తమ విధివిధానాలను వెల్లడించారని పేర్కొన్నారు.ఇంకా చర్చలు తొలిదశలోనే ఉన్నాయని కాస్తా ఆలస్యమైనా ప్రజాభీష్టా నిర్ణయానికే జై కొడతామన్నారు.అంతే తప్ప ఫలానా పార్టీ వైపు తాము మొగ్గుచూపుతున్నాం అని వస్తున్న వార్తలన్ని అవాస్తవమని కొట్టిపారేశారు.

# మావోయిస్టు కదలికలపై నిరంతరం అప్రమత్తత అవసరం

## -పోలీస్ అధికారులకు డీజీపీ అంజనీ కుమార్ ఆదేశించారు

హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్) : రాష్ట్రంలో ఏ ఒక్క చిన్న సంఘటన జరిగినా అది తెలంగాణా రాష్ట్ర అభివృద్ధి పై తీవ్ర ప్రభావం చూపిస్తుందని, ఈపరిస్థితుల్లో పోలీస్ అధికారులు మరింత అప్రమత్తంగా ఉండాలని డీజీపీ అంజనీ కుమార్పోలీస్ అధికారులను ఆదేశించారు. దక్షిణ బస్తర్ లోని అరుణపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఏప్రిల్ 26న జరిగిన మందుపాతరపేలుడులో 10 మంది భద్రతా సిబ్బందితోపాటు ఒక పౌరుడు మరణించిన సంఘటన విషయం తెలిసిందే.ఈ నేపథ్యంలో రాష్ట్రంలో వామపక్ష తీవ్రవాద ప్రభావిత జిల్లాల పోలీస్ అధికారులతో డీజీపీ గురువారం తన కార్యాలయం నుంచి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వర్క్ షాప్ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ ప్రముఖులువీవీఐపీల పర్యటన సమయంలో భద్రతా బలగాలు సంచరించే సమయంలో తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇదే సమయంలో రాష్ట్రాల సరిహద్దుల ప్రాంతాల్లో మావోయిస్టుల యాక్షన్ టీంల కదలికలు పెరిగే అవకాశం ఉ ందన్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలన్నారు.ప్రత్యేక రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ఐటీ పరిశ్రమలు అనేక బహుళజాతి సంస్థలు హైదరాబాద్ కేంద్రంగా తమ కార్యాలయాలు ఏర్పాటు చేసుకున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఏ చిన్న సంఘటన జరిగినా అంతర్జాతీయంగా ఇబ్బందికర పరిస్థితులు ఏర్పడే ప్రమాదం ఉందన్నారు. మావోయిస్టులు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నారని, ఒకర్ని దెబ్బతీయడం వల్ల వేలాది మందిని భయభ్రాంతులకు గురిచేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. పోలీస్ శాఖనిరంతర కృషి వల్ల తెలంగాణలో వామపక్షతీవ్రవాదం పూర్తిగా అంతరించిపోయిందని పేర్కొన్నారు. ఇప్పటి వరకు తెలంగాణ ప్రాంతంలో 96 ల్యాండ్ మైన్ అమర్చిన, పేలుడు ఘటనలు వెలుగుచూశాయని చెప్పారు. మావోయిస్టు చర్యలకు సంబంధించిన కీలక దాడుల్ని ఈ సందర్భంగా డీజీపీ అధికారులకు వివరించారు. ఈ వర్క్ షాప్ లో అడిషనల్ డీజీ గ్రేహౌండ్స్ విజయ్ కుమార్, అడిషనల్ డీజీ సంజయ్ కుమార్ జైన్, ఐజీ ఎస్ఐబీ ప్రభాకర్ రావు, ఐజీలు చంద్రశేఖర్ రెడ్డి, షానవాజ్ ఖాసీం ఇతర ఉ న్నతాధికారులు పాల్గొన్నారు.

# కేవలం 22 గంటల (0.9 రోజులకు సమానం) టర్న్-అరౌండ్ టైమ్తో

# భారత్ను అత్యుత్తమ కార్గో నిర్వహణ దేశాల్లో ఒకటిగా నిలిపిన జేఎన్పీఏ

న్యూఢిల్లీ, మే4:భారతదేశ ప్రధాన కంటైనర్ పోర్ట్ అయిన 'జవహర్లాల్ నెహ్రూ పోర్ట్ అథారిటీ' (జేఎన్పీఏ), గత ఆర్థిక సంవత్సరంలో రికార్డ్ స్థాయి నిర్వహణ పనితీరును కనబరిచింది. ఆ ఘనత సాధించిన కేవలం ఒక నెల తర్వాత, కంటైనర్ కార్గో నిర్వహణలో ప్రపంచ స్థాయి కొలమానాన్ని నెలకొల్పి మరో మైలురాయి సాధించింది. ప్రపంచ బ్యాంక్ ప్రచురించిన లాజిస్టిక్స్ పనితీరు సూచీ (ఎల్పీఐ) నివేదిక - 2023 ప్రకారం, జేఎన్పీఏ కేవలం 22 గంటల (0.9 రోజులకు సమానం) అద్భుతమైన టర్న్అరౌండ్ టైమ్ను (టాట్) కలిగి ఉంది, భారతదేశాన్ని అత్యుత్తమ నిర్వహణ దేశాల్లో ఒకటిగా నిలిపింది.

నౌకలను నిలిపివుంచే సమయాన్ని తగ్గించడంలో తీసుకున్న వివిధ చర్యల కారణంగా జేఎన్పీఏ ఈ ఘనత సాధించింది. మెరుగైన రైలు-రోడ్డు అనుసంధానం, కేంద్రీకృత పార్కింగ్ ప్లాజా (సీపీపీ), పనుల డిజిటలీకరణ, నౌకల నిలుపుదల ఉ తిరిగి పంపడ ంలో క్రమబద్ధీకరణ, నౌకను సజావుగా తీసుకురావడానికి మరిన్ని టగ్లను మోహరించడంతో తో పాటు టెర్మినల్ నిర్వాహకుల కార్యాచరణ సామర్థ్యం కూడా అతి పెద్ద సహకారంగా నిలిచింది. నౌకాశ్రయం సమర్థవం తంగా పని చేసేలా జేఎన్పీఏ చేపట్టిన కొన్ని కార్యక్రమాలు ఇవి.

"జేఎన్పీఏ గురించి మనందరికీ ఇది ఒక ఉత్సాహభరిత వార్త. 2022-23లో 6.05 మిలియన్ టీఈయూలను నిర్వహించి నెల క్రితమే రికార్డ్ సాధించాం. ఎల్పీఐ 2023 నివేదిక ప్రకారం, మన సామర్థ్యం అనేక దేశాల కంటే మెరుగ్గా ఉందని ప్రపంచ బ్యాంక్ సమాచారం స్పష్టం చేసింది. ఎగ్జిమ్ వాణిజ్యం కోసం లాజిస్టిక్స్ ధరను మరింత తగ్గించడానికి కట్టుబడి ఉన్నాం" అని జేఎన్పీఏ చైర్మన్ శ్రీ సంజయ్ సేథీ చెప్పారు.ఈ అద్భుత విజయం పట్ల జేఎన్పీఏ అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు నౌకాశ్రయ బృందాన్ని అభినందించారు.

# రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికి మెరుగైన వైద్యం

మెదక్, మే4: (నేటినిజం ప్రతినిధి): రాష్ట్ర ప్రభుత్వం ప్రజలందరికి మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశ్యంతో అన్ని ప్రభుత్వానుపత్రులలో మౌలిక వసతులతో అన్ని సౌకర్యాలు కల్పించిందని, ఆ సేవలు రోగులకు అందేలా వైద్య సిబ్బంది అంకితభావంతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా వైద్యాధికారులకు సూచించారు. రోగులను ప్రేమ, అప్యాయతతో పలకరిస్తూ వైద్యం అందించాలని, అదే వారిలో సగం ధైర్యం వస్తుందని అన్నారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి జిల్లా ఆసుపత్రిని ఆకస్మికంగా సందర్శించి వివిధ వార్డులను, ల్యాబ్ లను, ఆపరేషన్ థియేటర్ ను పరిశీలించారు. థియేటర్ లో ఆపరేషన్ కు కావలసిన అన్ని ఎక్విప్మెంట్ మంచి కండిషన్ లో ఉండాలని, సాంకేతిక సిబ్బంది సకాలంలో వచ్చేలా చూడాలన్నారు. ఈ సందర్భంగా వివిధ రికార్డులను పరిశీలించి ఆసుపత్రికి వస్తున్న అవుట్ పేషంట్, ఇన్ పేషంట్ ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చికిత్స పొందుతున్న రోగులను పరామర్శించి ఏ జబ్బు ఉంది.. వైద్యులు సమయానికి వచ్చి పరీక్షిస్తున్నారా.. నర్సులు ఇంజెక్షన్, మందులు టైం కు అందిస్తున్నారా .. ఇప్పుడు ఆరోగ్య ఎలా ఉంది.. టిఫిన్ ఇస్తున్నారా .. అని వివరాలడుగుతూ పేషంట్ కేస్ షీట్లను పరిశీలించారు. కొందరు రోగులకు అల్పాహారం అందకపోవడం పట్ల నర్సులపై అసంతృప్తి వ్యక్తం చేస్తూ మెనూ ప్రకారం రోగులకు అల్పాహారం, భోజనం అందించాలని, ఇందుకు సంబంధించి ప్రతి వార్డులో డైట్ మెనూ ప్రదర్శించాలని అధికారులకు సూచించారు. ఎల్లప్పుడూ వార్డులు, శౌచాలయాలు పరిశుభ్రంగా ఉండేలా ర్యాండమ్ గా పర్యవేక్షిస్తుండాలని అన్నారు. శిథిలావస్థలో ఉన్న పాత డయాలసిస్ సెంటర్ భవనాన్ని తక్షణమే డిస్మెంటల్ చేయుటకు ప్రతిపాదనలు పంపవలసినదిగా ఆదేశించారు. వర్షాకాలం వచ్చే జూన్ లోపు వాటర్ లీకేజీలను అరికట్టాలని అన్నారు. ఆసుపత్రి మొదటి అంతస్తులో చిన్న పిల్లలకు వైద్యం అందించుటకు నిర్మించబోయే ఎర్లీ డిటెక్షన్ సెంటర్ ప్రాంతాన్ని సందర్శించి వెంటనే టెండర్లు ఆహ్వానించి పనులు మొదలు పెట్టాలని టీఎస్ ఎం డి సి ఈ ఈ రవీందర్ రెడ్డికి సూచించారు. కలెక్టర్ వెంట జిల్లా ఆసుపత్రి సూపరింటెండెంట్ చంద్రశేఖర్, జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. చందు నాయక్, ఈ ఈ రవీందర్ రెడ్డి తదితరులున్నారు.

నిర్మాణాలు చివరి దశలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ సముదాయంలో మిగిలిపోయిన చిన్న చిన్న పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేయవలసినదిగా జిల్లా కలెక్టర్ రాజర్షి షా ఇంజనీరింగ్ అధికారులు, కాంట్రాక్టర్లను ఆదేశించారు. గురువారం స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ప్రతిమ సింగ్ తో కలిసి నర్సాపూర్ మునిసిపాలిటీలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణ పురోగతి పనులను సమీక్షిస్తూ 252 ఇండ్లలో నడుస్తున్న కిటికీలు,ఎలక్ట్రిఫికేషన్, పెయింటింగ్, ప్లంబింగ్ వంటి మిగిలిపోయిన చిన్న చిన్న పనులను ఈ నెలాఖరు నాటికి పూర్తి చేస్తూ మౌలిక సదుపాయాలతో పాటు పరిసర ప్రాంతాలను చదును చేసి ప్రారంభానికి సిద్ధం చేయువలసినదిగా కలెక్టర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో పంచాయత్ రాజ్ ఈఈ సత్యనారాయణ రెడ్డి, మునిసిపల్ కమిషనర్ వెంకట గోపాల్, తహశీల్దార్ ఆంజనేయులు, ఎంపిడిఓ, కాంట్రాక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# ఇంటర్ బోర్డ్ గుడ్న్యూస్.. 500 ఫీజు కడితే హాజరు నుంచి మినహాయింపు

రెగ్యులర్గా కాలేజీకి వెళ్లకుండానే ఆర్ట్స్ గ్రూప్లో ఇంటర్మీడియట్ చదవాలనుకునేవారికి తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు అద్భుత అవకాశం కల్పించింది. ఆయా అభ్యర్థులు హాజరు నుంచి మినహాయింపు పొందడానికి రూ.500 ఫీజు చెల్లించాల్సి ఉంటుంది.

ఆ తరువాత పరీక్ష ఫీజు చెల్లించి ఇంటర్ పరీక్షలు రాయొచ్చని బోర్డు అధికారులు తెలిపారు.

ఇలాంటి విద్యార్థులు ఈ నెల 10 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకోవచ్చు. వివరాల కోసం tsbie.cgg.gov.in వెబ్సైట్ను సందర్శించాలని లేదా 040-24600110 నంబర్కు ఫోన్ చేసి సంప్రదించాలని ఇంటర్ పరీక్షల నియంత్రణాధికారి జయప్రదాబాయి సూచించారు.

# కనీవినీ ఎరుగని రీతిలో వరంగల్ అభివృద్ధి : మంత్రి ఎర్రబెల్లి

వరంగల్, మే4: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆశీస్సులు, మంత్రులు కేటీఆర్, హరీశ్రావు సహకారంతో వరంగల్ నగరం కనీవినీ ఎరుగని రీతిలో అభివృద్ధి చెందుతుందని రాష్ట్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు వెల్లడించారు. మంత్రి కేటీఆర్ శుక్రవారం నగరంలో పలు అభివృద్ధి కార్యక్రమాల ప్రారంభం సందర్భంగా గురువారం జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో మంత్రి సమీక్ష సమావేశం ఏర్పాటు చేశారు.

ఈ సందర్భంగా హనుమకొండ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం, వైకుంఠ ధామం. కాజీపేటలో నిర్వహించనున్న బహిరంగ సభ స్థలం, భూమి పూజ జరిగే వరంగల్ నాయుడు పెట్రోల్ బంక్ ప్రాంతాన్ని సందర్శించారు. ఆయా చోట్ల ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు చేశారు. మంత్రి మాట్లాడుతూ వరంగల్ మహానగర అభివృద్ధికి రూ.2,500 కోట్లకు పైగా నిధులు తీసుకొచ్చామని వెల్లడించారు.



రేపు వరంగల్ పశ్చిమ నియోజకవర్గ పరిధిలో రూ. 181. 45 కోట్లతో పలు అభివృద్ధి పనులకు మంత్రి కేటీఆర్(ఎ ఓతినితిబబివతీ ఖఖీ) శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు చేస్తారని వివరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేస్తున్న బహిరంగ సభకు బీఆర్ఎస్ శ్రేణులు, ప్రజలు పెద్ద సంఖ్యలో తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ సమీక్షలో ప్రభుత్వ చీఫ్ విప్ దాస్యం వినయ్ భాస్కర్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్ రెడ్డి, మేయర్ గుండు సుధారాణి, వరంగల్, హనుమకొండ కలెక్టర్లు, సీపీ, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# చిన్న వంగర ధాన్యం కొనుగోలు సెంటర్ ఇన్చార్జి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేసినా కలెక్టర్




మహబూబాబాద్, మే4:(నేటినిజం ప్రతినిధి): రైతులు పండించిన ధాన్యం కానీ మక్కలు కానీ కొనుగోలు చేస్తున్నది ఒక తెలంగాణ రాష్ట్రమేనని దేశంలో ఏ రాష్ట్రాలు కొనుగోలు చేయడం లేదని ఇది ప్రజలు గ్రహించాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణ అభివృద్ధి మంచినీటి సరఫరా శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు స్పష్టం చేశారు.

గురువారం మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు, జిల్లా కలెక్టర్ శశాంకతో కలిసి పెద్ద వంగర మండలంలో విస్తృతంగా పర్యటించారు.

బంగారు చెలిమి తండా లో సర్పంచ్ ధరావత్ పద్మ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన భాగ్యలక్ష్మి మక్కల కొనుగోలు కేంద్రాన్ని రైతులు, ప్రజాప్రతినిధులు ,అధికారులతో కలిసి మంత్రి ప్రారంభించి మాట్లాడారు .

తెలంగాణ ఏర్పడిన తర్వాత విద్యుత్తు ,సాగునీరు కొరతలేదని అన్ని వనరులు సమృద్ధిగా లభించడంతో రైతులు ఆనందంగా పంటలు పండించుకుంటున్నట్లు చెప్పారు

1600 పలుకుతున్న మక్కలకు రాష్ట్ర ముఖ్యమంత్రి 1962 రూపాయలు మద్దతు ధర ఇచ్చి కొనుగోలు చేయటం రైతుల పక్షపాతిగా పేర్కొన్నారు రైతులు అకాల వర్షాలకు దాన్యం తడిసిందని అధైర్య పడరాదని తడిసిన ధాన్యాన్ని కూడా కొనుగోలు చేయడం జరుగుతుందన్నారు.

రెండు పంటలు పండడంతో భూములకు కూడా ధరలు పెరిగాయి అన్నారు. ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి పరిచేందుకు తిరుమలగిరి నుండి హరిపిరాల మీదుగా పెద్ద ముప్పారం వరకు డబల్ రోడ్డును 20 కోట్లతో మంజూరు చేసామన్నారు. అనంతరం అవుతాపురం రైతు వేదికలో ఏర్పాటుచేసిన కుట్టు మిషన్ శిక్షణ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. మహిళలు కుట్టు శిక్షణ నేర్చుకొని ఆర్థికంగా బలోపేతం కావాలన్నారు

జిల్లా కలెక్టర్ శశాంక మాట్లాడుతూ ధాన్యం మొక్కజొన్న కొనుగోలు కేంద్రాల నిర్వహణ తీరును సంబంధిత అధికారులతో పర్యవేక్షిస్తూ

ధాన్యం మక్కల కొనుగోళ్లు సజావుగా నిర్వహించేందుకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

చిన్న వంగర ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి సెంటర్ ఇన్చార్జి లేకపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉన్నతాధికారులు పర్యవేక్షిస్తూ చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ధాన్యం కొనుగోలు అనంతరం అదే రోజు రవాణా చేపట్టాలన్నారు. ప్రతి సెంటర్లో టార్పాలిన్స్ అందుబాటులో ఉంచుకోవాలని అవసరమైతే అదనంగా తెప్పించుకోవాలని అడిగిన రైతులకు కూడా అద్దెకు ఇవ్వాలన్నారు.

చిట్యాల కొనుగోలు కేంద్రంలో కలెక్టర్ రైతులతో మాట్లాడారు. ధాన్యం నాణ్యతతో కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలన్నారు.

ఎట్టి పరిస్థితుల్లోనూ ధాన్యాన్ని నేరుగా మిల్లర్లకు అమ్మ రాదని సూచించారు.

ఈ కార్యక్రమంలో ఎంపిపి ఈదురు రాజేశ్వరి,జెడ్పిటిసి జ్యోతిర్మయి,ఆర్డీవో రమేష్, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘ చైర్మన్ కాకిరాల హరి ప్రసాద్ , సహకార శాఖ అధికారి ఖుర్షిద్ ,అదనపు పీడీ వెంకట్ ,తాసిల్దార్ రమేష్ బాబు, ఎంపీడీవో వేణుగోపాల్ రెడ్డి ,వ్యవసాయ శాఖ అధికారి కుమార్, డిపిఎం నళిని , సివిల్ సప్లై డిటి నారాయణరెడ్డి, రైతులు ప్రజాప్రతినిధులు అధికారులు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# భారతదేశం-ఇజ్రాయెల్ల మధ్య మైత్రి - పారిశ్రామిక పరిశోధన మరియు అభివృద్ధి సహకారం లో కొత్త శకం ప్రారంభం

న్యూఢిల్లీ, మే4:భారతదేశం మరియు ఇజ్రాయెల్ మధ్య సైన్స్ అండ్ టెక్నాలజీ సహకారంలో ఒక ముఖ్యమైన మైలురాయిగా, భారత ప్రభుత్వ సైన్స్ అండ్ టెక్నాలజీ మంత్రిత్వ శాఖ (ఓసీూ) ఆధ్వర్యంలోని కౌన్సిల్ ఆఫ్ సైంటిఫిక్ అండ్ ఇండస్ట్రియల్ రీసెర్చ్ (ఊఎఖీ) మరియు ఇజ్రాయెల్ దేశ రక్షణ మంత్రిత్వ శాఖ కు చెందిన డైరెక్టరేట్ ఆఫ్ డిఫెన్స్ రీసెర్చ్ అండ్ డెవలప్మెంట్ (ఆఆఖీడఆ) ల మధ్య పారిశ్రామిక పరిశోధన మరియు అభివృద్ధి సహకారం కోసం అవగాహన ఒప్పందం పై (ఓూఱ) సంతకం చేశారు.

గౌరవ సైన్స్ అండ్ టెక్నాలజీ అండ్ ఎర్త్ సైన్సెస్ మంత్రి మరియు సీ ఎస్ ఐ ఆర్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ ఈ సమావేశానికి హాజరైనందుకు మరియు సీ ఎస్ ఐ ఆర్ కి వారందిస్తున్న నిరంతర మద్దతు కు డాక్టర్ ఎన్ కళైసెల్వి, డీ జీ, సీ ఎస్ ఐ ఆర్ మరియు సెక్రటరీ, డీ ఎస్ ఐ ఆర్ ధన్యవాదాలు తెలిపారు. ఆమె విదేశీ ప్రముఖులను స్వాగతించారు మరియు సీ ఎస్ ఐ ఆర్ యొక్క దార్శనికత స్థూలదృష్టిని వివరించారు. సీ ఎస్ ఐ ఆర్ సాంకేతిక మరియు పరిశోధనా నైపుణ్యం మరియు డీ డీ ఆర్ అండ్ డీ, ఇజ్రాయెల్తో వైమానిక, వైద్య, ఇంధన రంగాల్లో కొనసాగుతున్న సహకార చర్చలను కూడా ఆమె గుర్తుచేశారు. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్, క్వాంటం మరియు సెమీకండక్టర్స్, సింథటిక్ బయాలజీ మొదలైన అత్యున్నత సాంకేతిక రంగాలలో ఇజ్రాయెల్తో సహకారాన్ని పెంపొందించడం కోసం సీ ఎస్ ఐ ఆర్ యొక్క ప్రాధాన్యతా అంశాలను పంచుకోవడం ద్వారా డీ డీ ఆర్ అండ్ డీ ఆసక్తిని ఆమె స్వాగతించారు.

సీ ఎస్ ఐ ఆర్ తో కొనసాగుతున్న సహకార ప్రయత్నాలను గుర్తిస్తూ, డీ డీ ఆర్ అండ్ డీ హెడ్ డా. డేనియల్ గోల్డ్, సీ ఎస్ ఐ ఆర్- డీ డీ ఆర్ అండ్ డీ సహకారం రెండు దేశాల సంక్షేమానికి ప్రయోజనకరంగా ఉంటుందని అభిలషించారు. డీ డీ ఆర్ అండ్ డీ కేవలం ఆర్ అండ్ డీ సంస్థలతో మాత్రమే కాకుండా స్టార్టప్లు మరియు కంపెనీలు, వెంచర్ క్యాపిటల్స్తో రెండు వైపులాసహకారాన్ని స్వాగతిస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇజ్రాయెల్ బలాలైన ఏ ఐ మరియు ఫోటోనిక్స్ తో పాటు మెరుగైన భవిష్యత్తు నిర్మాణానికి మార్గం సుగమం చేసే హై టెక్నాలజీ రంగాలలో సీ ఎస్ ఐ ఆర్ తో సహకారాన్ని స్వాగతించారు.

భారతదేశం-ఇజ్రాయెల్ మధ్య మూడు దశాబ్దాల విజయవంతమైన దౌత్య సంబంధాలను విజయవంతంగా పూర్తి చేసిన విషయాన్ని నొక్కి చెబుతూ, భారతదేశంలోని ఇజ్రాయెల్ రాయబారి శ్రీ నౌర్ గిలోన్, ఇజ్రాయెల్ మరియు భారతదేశం మధ్య సన్నిహిత స్నేహ సంబంధాల గురించి గుర్తు చేశారు. ఇది 2018లో రెండు దేశాల ప్రధానమంత్రుల అభినందన పర్యటనల తర్వాత వ్యూహాత్మక భాగస్వామ్యంగా ఎదిగింది. ప్రస్తుత సీ ఎస్ ఐ ఆర్-డీ డీ ఆర్ అండ్ డీ సహకారం భారతదేశం-ఇజ్రాయెల్ సంబంధాలలో మరో మైలురాయిగా అభివర్ణించారు.

గౌరవ భారత ప్రభుత్వ ఎస్ ఉ టీ మంత్రి మరియు సీ ఎస్ ఐ ఆర్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ డాక్టర్ జితేంద్ర సింగ్ సమక్షంలో సీ ఎస్ ఐ ఆర్-డీ డీ ఆర్ అండ్ డీ ఎంఓయూపై డాక్టర్ ఎన్ కలైసెల్వి మరియు డాక్టర్ డానియల్ గోల్డ్ లు సంతకాలు చేశారు.

పరస్పర అంగీకారయోగ్యమైన పారిశ్రామిక సాంకేతిక రంగాలలో నిర్దిష్ట ప్రాజెక్టుల అమలు ద్వారా పారిశ్రామిక ఆర్ అండ్ డీ కార్యక్రమాలలో సహకారాన్ని ఎంఓయు అనుమతిస్తుంది. ఈ సహకారం వైద్య రంగం తో సహా ఏరోస్పేస్ ఉ ఎలక్ట్రానిక్స్ ఇన్స్ట్రుమెంటేషన్; సివిల్, ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఉ ఇంజనీరింగ్; రసాయనాలు మరియు పెట్రోకెమికల్స్, శక్తి పరికరాలతో సహా సు హరిత శక్తి; ఎకాలజీ, ఎన్విరాన్మెంట్, ఎర్త్ ఉ ఓషన్ సైన్సెస్ మరియు వాటర్; మైనింగ్, మినరల్స్, మెటల్స్ ఉ మెటీరియల్స్; వ్యవసాయం, పోషకాహారం ఉ బయోటెక్నాలజీ వంటి కీలక పారిశ్రామిక రంగాలకు విస్తరించింది. పరస్పర ప్రయోజనకరమైన పారిశ్రామిక మరియు సాంకేతిక సహకారాన్ని ముందుకు తీసుకెళ్లడం కోసం సీ ఎస్ ఐ ఆర్ మరియు డీ డీ ఆర్ అండ్ డీ అధిపతుల నేతృత్వంలోని జాయింట్ స్టీరింగ్ కమిటీ ఎంఓయూ సహకారం అమలును పర్యవేక్షిస్తుంది.

సీ ఎస్ ఐ ఆర్ మరియు డీ డీ ఆర్ అండ్ డీ మధ్య ప్రస్తుతం చర్చించబడుతున్న హైడ్రోజన్ మరియు ఏరోస్పేస్పై నిర్దిష్ట సహకారాన్ని సీ ఎస్ ఐ ఆర్-నేషనల్ ఏరోస్పేస్ లాబొరేటరీస్ (సీ ఎస్ ఐ ఆర్-ఎన్ ఏ ఎల్) డైరెక్టర్ డాక్టర్ అభయ్ పాశిల్కర్ మరియు సీ ఎస్ ఐ ఆర్-నేషనల్ కెమికల్ లాబొరేటరీ (సీ ఎస్ ఐ ఆర్-ఎన్ సీ ఎల్) డైరెక్టర్ డాక్టర్ ఆశిష్ లేలే వివరించారు. సీ ఎస్ ఐ ఆర్ యొక్క హై ఆల్టిట్యూడ్ ప్లాట్ఫారమ్, హైడ్రోజన్ వ్యాలీ ప్రోగ్రామ్లతో సహా ఈ రంగాలలో భవిష్యత్ సాంకేతికతలలో సహకారాన్ని వారు స్వాగతించారు.

సీ ఎస్ ఐ ఆర్-ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ కెమికల్ టెక్నాలజీ (సీ ఎస్ ఐ ఆర్-ఐ ఐ సీ టీ) మరియు 101 థెరప్యూటిక్స్ మధ్య చికిత్సా విధానంలో అపారమైన చికిత్సా సామర్థ్యాన్ని కలిగి ఉన్న కోవిడ్-19 ఔషధం యొక్క క్లినికల్ ట్రయల్స్ నిర్వహించడం గురించి వివరించారు. ఇది విజయవంతమైతే, భవిష్యత్తులో వచ్చే మహమ్మారి నివారణకు ఇది అత్యంత సముచితమైనది మరియు ప్రభావవంతమైనది. ఈ సమావేశంలో సీ ఎస్ ఐ ఆర్-ఐ ఐ సి టీ మరియు 101 థెరప్యూటిక్స్ మధ్య సహకార అవగాహనా ఒప్పందాలు కూడా జరిగాయి.అంతర్జాతీయ మిల్లెట్స్ సంవత్సరాన్ని జరుపుకుంటూ భారతదేశం మరియు ఇజ్రాయెల్ ల మధ్య విజయవంతమైన దౌత్య సంబంధాల మైత్రీ బంధం 30 సంవత్సరాలు పూర్తి చేసుకున్నందున, అలాగే భారతదేశం జీ 20 అధ్యక్ష పదవిని నిర్వహిస్తున్నందున, భారతదేశ ప్రధానమంత్రి నాయకత్వంలో భారతదేశం ఎస్ అండ్ టీ రంగంలో ఇది చాలా ముఖ్యమైన సంవత్సరం అని డాక్టర్ జితేంద్ర సింగ్ తన వ్యాఖ్యలలో పేర్కొన్నారు. సీ ఎస్ ఐ ఆర్ దాదాపు అన్ని గుర్తించబడిన ప్రాధాన్యతా రంగాలలో ప్రత్యేక ప్రయోగశాలలను కలిగి ఉందని, అందువల్ల ఈ సహకారానికి తగిన యోగ్యత ఉందని ఆయన వివరించారు. ఉదా. సీ ఎస్ ఐ ఆర్-ఎన్ సీ ఎల్ ద్వారా స్వదేశీ హైడ్రోజన్ ఫ్యూయల్ సెల్ బస్సు, సీ ఎస్ ఐ ఆర్-ఐ ఐ ఐ ఎం ద్వారా పర్పుల్ విప్లవం (లావెండర్ పెంపకం) వంటి వాటిని ఆయన ఉదహరించారు. ఇజ్రాయెల్తో సాంకేతిక భాగస్వామ్యాన్ని ఆయన స్వాగతించారు మరియు భారతదేశం-ఇజ్రాయెల్ సంబంధాన్ని బలోపేతం చేయడానికి ఇరుపక్షాల కృషికి అభినందనలు తెలిపారు.

# పంట నష్టంపై ప్రభుత్వానికి నివేదిక అందించాలి

## -డాక్టర్ గోలి మోహన్
## -పసునూరులో నేలపాలైన పంట పొలాల పరిశీలన



రాజన్న సిరిసిల్ల, మే4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ నియోజకవర్గం భీమారం మండలం పసునూరు గ్రామంలో అకాల వర్షాలకు నేలపాలైన పంట పొలాలను డాక్టర్ గోలి మోహన్ గురువారంపరిశీలించారు. ఈ సందర్భంగా పసునూరు గ్రామంలో వడగండ్ల వానకు 99 శాతం వడ్లు పొలంలో రాలిపోయి రైతులు మనో వేదనతో తల్లడిల్లుతున్నారన్నారు.

దీనిపై స్థానిక అధికారులతో మాట్లాడి రైతులకు అండగా ఉండాలని, వీలైనంత త్వరగా పంట నష్టాన్ని అంచనా వేసి ప్రభుత్వానికి నివేదిక అందజేయాలని సూచించారు. అనంతరం అధికారులు నిర్లక్ష్యంతో కొన్ని పొలాలలో నష్టపోయిన పంటను రాసుకోవడం లేదని రైతులు ఆవేదనతో డాక్టర్ గోలి మోహన్ కి విన్నవించారు. దీంతో ప్రభుత్వము రైతుల పట్ల సానుకూలంగా ఉందని, అలాంటప్పుడు అధికారులు ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ప్రశ్నించారు.

అధికారుల పద్ధతి సరైందికాదని, తినే ప్రతి గింజ పైన రైతు అని రాసి ఉంటుందని, అలాంటి రైతు కష్టాల్లో ఉన్నప్పుడు అన్ని డిపార్ట్మెంట్ అధికారులు తక్షణమే స్పందించాలన్నారు.

రైతులు నష్టాన్ని చూసి ఎలాంటి ఆందోళనకు గురికావ ద్దని అన్నారు. ప్రభుత్వం, నాయకులు రైతుల పక్షాన ఉండి వారికి మనోధైర్యం ఇవ్వాలని సూచించారు.

ఇది రాజకీయాలు చేసే సమయం కాదని, ప్రతి ఒక్క నాయకుడు తన బాధ్యతను గుర్తు చేసుకుని రైతులకు అండగా ఉండాలని విజ్ఞప్తి చేశారు. రైతులకు ఒకవేళ అధికారులు సరైన సమయంలో స్పందించకపోతే తన దృష్టికి తీసుకురావాలని అన్నారు. సాధ్యమైనంత వరకు సహాయ సహకారాలు అందిస్తానని తెలిపారు. తదనంతరం ఆరుకాలం కష్టపడి అకాల వర్షానికి ఉన్నదంతా పోయిందని, వట్టి గడ్డి పొరుకను ఏమి చేసుకోవాలని ఆవేదనతో కన్నీళ్ళ పరమైనారు.

ఇప్పటికైనా ప్రభుత్వం వెంటనే స్పందించి, రైతులకు నష్టపరిహారం ఇవ్వాలని, లేకుంటే మాకు చావే శరణ్యమని వేడుకున్నారు.

# ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుంది-స్పెషల్ బ్రాంచ్ డీఎస్పీ రవికుమార్



రాజన్న సిరిసిల్ల, మే4:(నేటినిజం ప్రతినిధి): ప్రజల భద్రతే ప్రధాన లక్ష్యంగా పోలీస్ శాఖ పని చేస్తుందని స్పెషల్ బ్రాంచ్ డిఎస్పీ రవి కుమార్ అన్నారు.ఇల్లంతకుంట మండలం రహీంఖాన్ పెట్ గ్రామంలో గురువారం కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం చేపట్టారు.

ఈ సందర్భంగా స్పెషల్ బ్రాంచ్ డి.ఎస్.పి రవికుమార్ మాట్లాడుతూఅనుమానితుల సమాచారం పోలీసులకు అందించాలని సూచించారు. గ్రామంలో 60 మంది పోలీసులతో కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహించి, సరైన పత్రాలు లేని 43 ద్విచక్ర వాహనాలు, 01ఆటో, 01 ట్రాక్టర్, సీజ్ చేసి సరైన పత్రాలు చూపించితీసుకవేళ్ళవచ్చున్నారు.

నేరాల నిర్మూలన కోసమే కమ్యూనిటీ కాంటాక్ట్ ప్రోగ్రాం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రజల రక్షణ, భద్రత కోసమే పోలీసింగ్ ఉందని, గ్రామాల్లో కొత్త వ్యక్తులు,నేరస్తులు, షెల్టర్ తీసుకుని ఉంటే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడ కూడదని, యువత చెడు అలవాట్లకు బానిసగా మారి జీవితాలను నాశనం చేసుకోవద్దని సూచించారు. గ్రామాల్లోకి గంజాయి మూలాలు రాకుండా చేసుకోవలసిన బాధ్యత గ్రామ ప్రజలదే అని, అలాంటి సమాచారం ఉంటే పోలీస్ వారికి సమాచారం అందించాలన్నారు. గ్రామాల్లో ఎలాంటి సమస్యలున్నా తమ దృష్టికి తీసుకరావాలని లేదా సమస్యలుంటే 100 నంబర్ కి కాల్ చేయాలని సూచించారు. గ్రామాల్లో బెల్ట్ షాప్ లు నిర్వహించి అక్రమంగా మద్యం అమ్మితే చట్ట పరమైన చర్యలు తీసుకుంటామన్నారు. సైబర్ నేరాలు, మోసగాళ్ల ఫోన్ కాల్స్, మెసెజ్లకు స్పందించవద్దని సూచించారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించాలని, చట్టవ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. వాహనాలు నడిపే టప్పుడు తప్పకుండా హెల్మెట్ ధరించాలి అని సూచించారు. డ్రైవింగ్ లైసెన్స్ అందరు కలిగి ఉండాలన్నారు. గ్రామాలలో మరింత స్వీయ రక్షణ కొరకు సీసీ కెమెరాలను అమర్చుకోవాలని, ఈ విషయంలో పోలీసుల సహకారం ఉంటుందని, భద్రతా పరమైన అంశాల లో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐ ఉపేందర్, ఎస్ఐలు రాజేష్, మహేష్, వెంకటేశ్వర్లు, లక్ష్మారెడ్డి, ఆర్ఎస్ఐలు రమేష్, జునైద్, సిబ్బంది పాల్గొన్నారు.

# లక్ష్మీనరసింహస్వామికి ఎమ్మెల్యే, జడ్పీ చైర్ పర్సన్ ప్రత్యేక పూజలు



రాజన్న సిరిసిల్ల, మే4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి అనుబంధ ఆలయమైన

నాంపెల్లి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవాలయంలో గురువారం జరిగిన శ్రీ లక్ష్మీనరసింహస్వామి కళ్యాణ మహోత్సవంకు ఎమ్మెల్యే రమేష్ బాబు, జడ్పీ చైర్ పర్సన్ న్యాలకొండ అరుణ హాజరయ్యారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకుని, ప్రత్యేక పూజలు చేశారు.

వారి వెంట మున్సిపల్ చైర్ పర్సన్ రామతీర్థపు మాధవి, జడ్పీటిసి మ్యాకల రవి, కౌన్సిలర్స్, నాయకులు ఉన్నారు.

# బాలానరసింహకు దళిత రత్న అవార్డు



హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);ముషీరాబాద్ నియోజకవర్గం గంగపుత్ర కాలనీకి చెందిన బర్గెల బాల నరసింహకు దళిత రత్న అవార్డు దక్కింది.తెలంగాణ మాల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ లెజిస్లేటివ్ కౌన్సిల్ లో జరిగిన ఒక కార్యక్రమంలో సీనియర్ ఎమ్మెల్సీ ప్రభాకర్ రావు చేతుల మీదుగా ఈ పురస్కారాన్ని అందజేశారు.

సామాజిక సేవ రంగంలో దాదాపు రెండు దశాబ్దాల నుండి దళిత బహుజన వర్గాల సంక్షేమ అభివృద్ధికి ఐక్యతకు కృషి చేస్తున్న బాల నరసింహకు ఈ అవార్డు ను అందజేసినట్లు నిర్వాహకులు తెలిపారు.ఈ సందర్భంగా బాల నరసింహ మాట్లాడుతూ తనకు దళిత రత్న అవార్డు ఇచ్చి సన్మానం చేసిన మాల సంక్షేమ సంఘం కార్యవర్గానికి కృతజ్ఞతలు తెలిపారు

# డ్రోన్ల వినియోగంపై నిషేదాజ్ఞలు

## -కరీంనగర్ సిపి సుబ్బరాయుడు



కరీంనగర్, మే4: (నేటినిజం ప్రతినిధి): కరీంనగర్ కమిషనరేట్ పరిధిలో భద్రత కారణాల దృష్ట్యా పారాగ్లైడర్స్, రిమోట్ కంట్రోల్ డ్రోన్స్, రిమోట్ కంట్రోల్ మైక్రోలైట్ ఏయిర్ క్రాఫ్ట్ ల వినియోగాన్ని నిషేదించడం జరిగిందని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బరాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నిషేదాజ్ఞలు ఈనెల 31 వరకు అమల్లో ఉంటాయని పేర్కొన్నారు.పైన పేర్కొన్న సాంకేతిక పరికరాలను ఈ మధ్యకాలంలో వివాహాది శుభకార్యాలు, వివిధ కార్యక్రమాల సందర్భంగా వినియోగించబడుతున్నాయని తెలిపారు. ఉగ్రవాదులు, అసాంఘికశక్తులు వీటిని వినియోగించే అవకాశాలుండటంతో సదరు సాంకేతిక పరికరాల వినియోగాన్ని నిషేదించడం జరిగిందని చెప్పారు. ఎవరైనా వినియోగించదలచినట్లయితే సంబంధిత పోలీసుల అనుమతి తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ మేరకు సంబంధిత పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేయడం జరిగిందని తెలిపారు. నిబంధనలను ఉల్లంఘించిన వారిపై ఐపిసి సెక్షన్ 188 ప్రకారం చట్టపరమైన చర్యలు తీసుకుంటామని చెప్పారు.

### శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చర్యలు

కమిషనరేట్ పరిధిలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఎల్ సుబ్బరాయుడు తెలిపారు. శాంతిభద్రతల పరిరక్షణ చర్యల దృష్ట్యా నియమ నిబంధనలు అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత ఎసిపిల అనుమతి లేకుండా సభలు, సమావేశాలు, ఊరేగింపులను నిర్వహించకూడదని చెప్పారు.

ఇతరులను గాయపరిచే విధంగా ఉండే వస్తువులు, మారణాయుధాలను ధరించి సంచరించకూడదు. రోడ్లు, ప్రజలకు ఉపయోగపడే ఇతర స్థలాల్లో జనాన్ని సమీకరించకూడదు. పేస పేర్కొన్న ప్రాంతాలలో మ్యూజిక్ లు, పాటలు, ప్రసంగాలు చేయవద్దని కోరారు. ఈ ఉత్తర్వులు ఈనెల 31 వరకు అమల్లో ఉంటాయని తెలిపారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే చర్యలకు పాల్పడే వారిపై హైదరాబాద్ నగర పోలీస్ చట్టం, 1348 ఫసలీ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటామని చెప్పారు.

# బీఆర్ఎస్ పేరు చెబితే ఆయా రాష్ట్రాల పార్టీలు భయపడుతున్నాయి

## -బీజేపీ నేత విజయశాంతి

హైదరాబాద్ మే 4 (ఎక్స్ ప్రెస్ న్యూ స్);: బీఆర్ఎస్ పేరు చెబితే మిగితా రాష్ట్రాల రాజకీయా పార్టీలు భయపడుతున్నాయని... ఏం చెయ్యాలో పాలుపోని పరిస్థితి అని బీజేపీ నేత విజయశాంతి అన్నారు. గురువారం సోషల్ మీడియా వేదికగా స్పందిస్తూ.. మహారాష్ట్రలో ఒక చిన్న రైతు సంఘం ఎన్నికలకు కూడా కోట్ల రూపాయలు పంచి అదే స్థాయిలో ముందెన్నడూ అక్కడ లేని విధంగా ఇతర రాజకీయ పార్టీలు డబ్బు పంపిణీ చెయ్యవలసిన దుర్మార్గాన్ని తయారు చేశారని మండిపడ్డారు. మున్ముందు దేశమంతా ఇదే భ్రష్టాచార వ్యవస్థను బీఆర్ఎస్ పేరుతో, తెలంగాణలో దోపిడీ చెయ్యబడ్డ లక్షల కోట్ల అవినీత ధన తోడ్పాటుతో దేశంలోని అన్ని పార్టీల ఎన్నికల ఖర్చు తామే భరిస్తామని కేసీఆర్ వెళ్తున్న విధానం, మొత్తం భారత ప్రజాస్వామ్య వ్యవస్థనే అవహేళన చేసి, నియంతృత్వ ఫ్యూడల్ ధోరణికి దారి చేస్తున్న పరిస్థితి కావచ్చేమో అని వ్యాఖ్యలు చేశారు. అటు ఏపీలో జనసేన పార్టీని కూడా వెయ్యి కోట్ల ప్రలోభంతో మోసగించి దెబ్బ తియ్యాలనే ప్రయత్నాన్ని ఆంధ్ర జ్యోతి వంటి అగ్రశ్రేణి దినపత్రికలలో వార్తలుగా వచ్చిందన్నారు. ఇక అవినీతికి వ్యతిరేకంగా అన్నా హజారే స్ఫూర్తితో పుట్టిన ఆమ్ ఆద్మీ పార్టీకి బీఆర్ఎస్ కుటుంబం ఢిల్లీ, పంజాబ్ల లో తెచ్చిపెట్టిన స్కాంల సమస్యతో ఆప్ అసలుకే నాశనమయ్యేట్లు అనిపిస్తున్నదంటూ విజయశాంతి సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు.

# వందే భారత్‌పై రాళ్ల దాడి - అరుగురి అరెస్ట్

అమరావతి, మే4: కేంద్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా దేశ వ్యాప్తంగా పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో తయారై పరుగులు పెడుతున్న వందే భారత్ రైళ్లపై ఇటీ-వల జరుగుతున్న దాడులకు అధికారులు గట్టిగానే స్పందించారు. వరుసగా వందే భారత్ రైళ్లపై జరుగుతున్న దాడులను సీరియస్గా తీసుకున్న రైల్వే ప్రొ-టె-క్షన్ పోలీసులు క్షుణ్ణంగా ఎంక్వయిరీ చేస్తున్నారు. ఏప్రిల్ 28వ తేదీన సామర్లకోట పిఠాపురం స్టేషన్ల మధ్య వందే భారత్ ఎక్స్ప్రెస్ పై రాళ్లతో దాడులకు పాల్పడిన యువకులను గుర్తించారు. హైదరాబాదు నుండి విశాఖపట్నం వెళ్తున్న వందే భారత్ ఎక్స్ప్రెస్ ఆరుగురు యువకులు రాళ్లతో దాడి చేసిన కారణంగా మర మ్మత్తులు నిర్వహణ కారణంగా ఎక్స్ప్రెస్ రైలును నాలుగు గంటల పాటు- రీ షెడ్యూల్ చేయబడింది. దీంతో ఇటు- ప్రయాణికులకు అటు- రైల్వే సమయాపాలనపై తీవ్ర ప్రభావం పడింది. ఈ దాడి ఘటనను అత్యంత సీరియస్గా తీసుకున్న రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ అధికారులు రాజమండ్రి సామర్లకోట వెళ్లి విచారణ జరిపి హనుమాన్తో ప్రదేశాల్లో విచారించారు

అయినప్పటికీ ఫలితం రాకపోవడంతో పొందే భారత్ రైల్లో ఏర్పాటు- చేసిన సీసీ కెమెరాలను ఆన్ బోర్డ్ సిసి ఫుటేజీని పూర్తిస్థాయిలో పరిశీలించారు. పిఠాపురం సామర్లకోట రైల్వే లైన్ మధ్యలో ఆరుగురు యువకులు ఉన్నట్లు- కనుగొన్నారు.

ఆ ప్రదేశానికి దారి తీసిన అప్రోచ్ రోడ్ లో గల స్థానికులను విచారించి అనుమానితులను గుర్తించారు. పూర్తిస్థాయిలో విచారణ చేయగా దాడికి సంబంధించిన ఆరుగురు యువకులను గుర్తించి వెంటనే వారిని అదుపులోకి తీసుకున్నారు. మొత్తం ఆరుగురుపై రైల్వే చట్టంలోని సెక్షన్ 153 కింద కేసు నమోదు చేసి వారిని విజయవాడలోని రైల్వే కోర్టుకు హాజరు పరిచారు. ఆర్పీ ఎఫ్ పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆరుగురిలో ముగ్గురు చిన్నారులు కాగా వారిని రాజమండ్రిలోని జువైనల్ కోర్టుకు హాజరు పరిచారు తదుపరిచర్ల కోసం జువైనల్ హోమ్ కు తరలించారు మిగతా ముగ్గురిని జ్యుడీషియల్ రిమాండ్ కి తర లించారు.విజయవాడ డివిజన్ సీనియర్ డిఎస్సి వల్లేశ్వర బాబుజి రాజమండ్రి ఐపీఎఫ్ అధికారి సైదయ్య బృందం ఈ కేసును శోధించి దాడికి పాల్పడున వారిని పట్టు-కోవడం పట్ల రైల్వే వర్గాలు ఆనందం వ్యక్తం చేసే వారిని అభినందించారు. ఈ సందర్భంగా విజయవాడ డివిజన్ రైల్వే మేనేజర్ సురేంద్రమోహన్ మాట్లాడుతూ రైళ్లపై రాళ్లు రావడం చట్టరీత్యా నేరమని నేరస్థలపై రైల్వే చట్టంలో కఠిన శిక్షలు విధించే అవకాశం ఉందని హెచ్చరించారు. ప్రజా ఆస్తులను నష్టం కలిగించే వారిపై కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

# ఏరియా ఆసుపత్రిలో తొమ్మిదిమందికి కంటి శస్త్ర చికిత్సలు

## -సూపరింటెండెంట్ రేగులపాటి మహేష్ రావు



రాజన్న సిరిసిల్ల, మే4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ ఏరియా ఆసుపత్రిలో గురువారం తొమ్మిదిమందికికంటి శస్త్ర చికిత్సలను విజయవంతంగా పూర్తి చేసినట్లు సూపరిండెంట్ రేగులపాటి మహేష్ రావు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోతిబిందు పొరతో చూపు మందగించి కంటి వైద్యం కోసం ఏరియా ఆస్పత్రికి వచ్చిన వారికి మెరుగైన వైద్యం అందించి, చూపు మెరుగు పడేలా చేయడం జరిగిందన్నారు. కిష్టంపేట గ్రామానికి చెందిన లక్ష్మి, వేములవాడ మండలానికి చెందిన పద్మ, బండపల్లి గ్రామానికి చెందిన రాజవ్వ, మానాల గ్రామానికి చెందిన కమిలి, మామిడిపల్లి గ్రామానికి చెందిన లక్ష్మి, జయవరం గ్రామానికి చెందిన బక్కయ్య, మానాల గ్రామానికి చెందిన సుక్క, కొనరావుపేట్ మండలానికి చెందిన రామస్వామి, వేములవాడ మండలానికి చెందిన బొండయ్యలకు కంటి శుక్లాలను తొలగించి లెన్స్ ను అమర్చినట్లు పేర్కొన్నారు. కంటి ఆపరేషన్ లు ఆరోగ్యశ్రీ ద్వారా పూర్తిగా ఉచితంగా శత్రచికిత్సలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఈ సేవలను ప్రజలు సద్విని చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆస్పత్రి సూపరిండెంట్ డాక్టర్ రేగులపాటి మహేష్ రావు, డాక్టర్ అనిల్ కుమార్, కంటి వైద్య చికిత్స నిపుణులు రత్నమాల, కంటి వైద్య సహాయకులు నర్సింగం, రాజేందర్,ఓ టీ సిబ్బంది, ఆరోగ్య మిత్ర పద్మారావు ఉన్నారు.

# 28 వార్డులో కంటి వెలుగు కార్యక్రమం ప్రారంభం



రాజన్న సిరిసిల్ల, మే 4:(నేటినిజం ప్రతినిధి): వేములవాడ పట్టణంలో: గురువారం రోజున 28వ.వార్డు బ్రహ్మంగారి దేవాలయంలో కంటి వెలుగు కార్యక్రమాన్ని మున్సిపల్ కమిషనర్ అన్వేష్, మున్సిపల్ కౌన్సిలర్ హిమబిందు ప్రారంభించారు. ఇట్టి కంటి వెలుగు కార్యక్రమం గురువారం నుండి (శని, అది వారాలు సెలవులు) బుధవారం వరకు నిర్వహించనున్నట్లు, నేటి కంటి పరీక్షా శిబిరంలో 110 మందికి పరీక్షలు నిర్వహించామని, ఇట్టి కంటివెలుగు కార్యక్రమంలో దగ్గరి చూపు, దూరపు చూపు పరీక్షలు చేసి అవసరం ఉన్నవారికి కంటి అద్దాలు, మందులు ఉచితంగా అందజేయడం జరుగుతుందని, ఇట్టి కంటి వెలుగు కార్యక్రమాన్ని అందరూ సద్వినియోగం చేసుకోవాలని మెడికల్ ఆఫీసర్ డాక్టర్. లహరి తెలియజేశారు. ఇట్టి కార్యక్రమంలో ప్రకాష్ ఆప్తమాలోజిస్ట్, ఏ.ఎన్. ఎం లు బి.వెంకటలక్ష్మి, వి. సృజన, ఆశావర్కర్లు వి.సృజన,బి.జ్యోతి, పి.విజయలక్ష్మి, కె. విజయ, ఎం.శ్రావణి డీ.ఈ.ఓ, గీత ఆర్పి తదితరులు పాల్గొన్నారు.

# మే 5న ఐబిసి సహకారంతో పవిత్ర వైశాఖ పౌర్ణమి కార్యక్రమాలు నిర్వహించనున్న సాంస్కృతిక శాఖ

అంతర్జాతీయ బుద్ధ సమాఖ్య (ఐబిసి) సహకారంతో మే 5న వైశాఖ పౌర్ణమి భక్తిశ్రద్ధలతో నిర్వహించడానికి సాంస్కృతిక మంత్రిత్వ శాఖ భారీ ఏర్పాట్లు చేస్తోంది. అంతర్జాతీయ బౌద్ధ సమాఖ్య (ఐబిసి) హిమాలయన్ బౌద్ధ సంస్కృతి సంఘం (హెచ్బిసిఎ) సమన్వయంతో న్యూఢిల్లీలోని నేషనల్ మ్యూజియంలో కార్యక్రమం జరుగుతుంది.

సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో పనిచేస్తున్న స్వయం ప్రతిపత్తి గల వివిధ బౌద్ధ సంస్థలు, అనుమతి పొందిన సంస్థలు ఈ సందర్భంగా అనేక కార్యక్రమాలు నిర్వహించడానికి సన్నాహాలు చేస్తున్నాయి.

.లెహ్‌లోని పోలో గ్రౌండ్‌లో లడఖ్ బౌద్ధ సంఘం (ఎల్బిఏ),లడఖ్ గొంపా అసోసియేషన్ (ఎల్జీఏ) ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమాల్లో లేహ్‌లోని కేంద్ర బౌద్ధ అధ్యయనాల సంస్థ (సిఐబిఎస్) సిబ్బంది, సంస్థలో చదువుతున్న 600 మంది విద్యార్థులు పాల్గొంటారు. ఈ సందర్భంగా లెహ్‌లోని సీబీఎస్ విద్యార్థులు 'మంగళాచరణ్' (ఆవాహన ప్రార్థన) నిర్వహిస్తారు. సీబీఎస్ లేహ్( కేంద్రపాలిత ప్రాంతం) విద్యార్థులు బుద్ధుని జననం, బుద్ధుని మొదటి ఉపన్యాసం వర్ణించే విధంగా రూపొందించిన రెండు శకటాల ప్రదర్శన ఉంటుంది.

ఉదయం 6:00 గంటలకు 'బుద్ధ జయంతి సమరోహ్'నిర్వహిస్తారు. కార్యక్రమం అనంతరం సారనాథ్ సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హయ్యర్ టిబెటన్ స్టడీస్ రూపొందించిన పరిశోధన మ్యాగజైన్ "ఆడిఏడి" 63వ ఎడిషన్ ఆవిష్కరణ కార్యక్రమం జరుగుతుంది.

బిహార్‌లోని నలందలోని నవ నలంద మహావిహార సన్యాసి-విద్యార్థులు బుద్ధ దేవాలయంలో సాంప్రదాయ పూజలు నిర్వహిస్తారు. తర్వాత 'బౌద్ధమతం- బీహార్' అనే అంశంపై ఒక రోజు జాతీయ సెమినార్ జరుగుతుంది.

బుద్ధ పూర్ణిమ సందర్భంగా అరుణాచల్ ప్రదేశ్‌లోని దహంగ్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హిమాలయన్ కల్చర్ స్టడీస్ సాంప్రదాయ ఆచారం ప్రకారం పూజ కార్యక్రమం నిర్వహిస్తుంది.

ఈ సందర్భంగా సంస్థ వక్తృత్వ పోటీలు నిర్వహిస్తుంది.

అరుణాచల్ ప్రదేశ్‌లోని జెంట్సే గాడెన్ రాబ్‌గేల్ లింగ్ మొనాస్టరీ సన్యాసి విద్యార్థులు ప్రపంచ శాంతి కోసం ప్రార్థనలు నిర్వహించిన 'మంగళాచరణ్'ని నిర్వహిస్తారు.

బుద్ధ పౌర్ణమి సందర్భంగా టిబెట్ హౌస్‌లో ఆకాంక్ష బోధిసత్వ ప్రతిజ్ఞ కార్యక్రమం జరుగుతుంది.

"బుద్ధుని ప్రబోధాలు, శాంతి , ప్రశాంతత" అనే అంశంపై తవాంగ్ మొనాస్టరీ, అరుణాచల్ ప్రదేశ్ వక్తృత్వ పోటీలు నిర్వహించనుంది.

లైబ్రరీ ఆఫ్ టిబెటన్ వర్క్స్ అ ఆర్కైవ్స్ (ఒచిం), ధర్మశాల, హిమాచల్ ప్రదేశ్ ఆధ్వర్యంలో మే 1 నుంచి మే 5, 2023 వరకు 'యానిమల్ కాన్షియస్‌నెస్ కాన్ఫరెన్స్ నిర్వహిస్తుంది.

వైశాఖ బుద్ధ పూర్ణిమ ప్రపంచవ్యాప్తంగా ఉన్న బౌద్ధులకు సంవత్సరంలో అత్యంత పవిత్రమైన రోజు. బుద్ధ భగవానుడి జీవితంలో మూడు ప్రధాన ఘట్టాలు- బుద్ధుని జననం, జ్ఞానోదయం, మహా పరి నిర్వాణం సూచిస్తుంది. బౌద్ధమతం భారతదేశంలో ఉద్భవించింది. దీంతో వైశాఖ బుద్ధ పూర్ణిమ భారతదేశంలో ప్రత్యేక ప్రాముఖ్యతను సంతరించుకుంది.

1999 నుంచి వైశాఖ బుద్ధ పూర్ణిమ ను ఐక్యరాజ్యసమితి వైశాఖ బుద్ధ పూర్ణిమ గా పాటిస్తోంది. ఈ సంవత్సరం వైశాఖ బుద్ధ పూర్ణిమ మే 5న జరుగుతుంది.

ఇటీవల సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నిర్వహించిన మొదటి గ్లోబల్ బౌద్ధ శిఖరాగ్ర సమావేశం (20–21 ఏప్రిల్)లో 30 దేశాలకు చెందిన 500 మందికి పైగా పాల్గొన్నారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ సమావేశాన్ని ప్రారంభించారు. మంత్రిత్వ శాఖ అనుమతి పొందిన సంస్థలు, అంతర్జాతీయ బౌద్ధ సంస్థగా గుర్తింపు పొంది న్యూఢిల్లీలో ప్రధాన కార్యాలయం కలిగి ఉన్న ఐబిసి సహకారంతో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ 14 నుంచి 15 వరకు "షేర్డ్ బౌద్ధ వారసత్వం" అనే అంశంపై నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సభ్య దేశాల నిపుణులు పాల్గొని విజయవంతం చేశారు. సమావేశాన్ని విజయవంతంగా నిర్వహించింది. షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ సభ్య దేశాల మధ్య సాంస్కృతిక సంబంధాలు పటిష్టం చేయాలని లక్ష్యంగా సదస్సు జరిగింది.

Printed, Published and own ed by VEENADAS, at Freedom Publications, SRT-74, Jawahar nagar, Ashok nagar, Hyderabad-500 020, Telang ana. Published at SRT-74, Jaw ahar nagar, Ashok nagar, Hyderabad-500020. Telangana. 'Editor: B. Devadas. **RNI No.52865/93.**
E-mail :netinijam93@gmail.com.